



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY









SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 192 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | శనివారం 04 ఏప్రియల్ 2026 | పేజీలు : 12 | వెల : 2/-


### దేశానికి ఫ్యూచర్ సిటీ

# అమరావతి



- వైసీపీ నాశనం చేస్తే -మేం శాసనం చేశాం • దేశమంతా మద్దతిస్తే వైసీపీ ఒక్కటే వ్యతిరేకించింది
- పార్లమెంటులో చేసిన చట్టాన్నీ గౌరవించరా?
- వైసీపీకి రాష్ట్ర ప్రజలు, వారి ప్రయోజనాలంటే లెక్కలేదు
- ఇక అమరావతిని ఎవరూ మార్చలేరు,కదల్చలేరు
- మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఒక్క వైసీపీ మినహా దేశంలోని అన్ని పార్టీలు ఏపీ రాజధాని అమరావతికి అండగా నిలిచాయని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. పార్లమెంటు ఉభయ సభల్లో అన్ని రాజకీయ పార్టీలూ, ఎంపీలు అమరావతి చట్టబద్ధత కల్పించే బిల్లుపై మద్దతు పలికితే ఒక్క వైసీపీ ఎంపీలు మాత్రమే వ్యతిరేకించి వాకౌట్ చేశారని వ్యాఖ్యానించారు. శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి మీడియా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఆవిర్భావం, రాజధాని ఏర్పాటు, అమరావతి ఎంపిక, వైసీపీ కుట్రలు, రాజధాని రైతుల ఉద్యమం, అసెంబ్లీ, మండలిలో జరిగిన పరిణామాలు, న్యాయ పోరాటం, రాజధాని పునర్నిర్మాణం వంటి అంశాలను సీఎం వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."ఒక్క పార్టీ మినహా దేశంలోని పార్టీలన్నీ రాజధానికి అండగా మిగతా .. 2లో..

### మానసిక పరిస్థితిని

## జగన్ పరిశీలించుకోవాలి


### గంటా శ్రీనివాసరావు



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ సీఎం జగన్ తన మానసిక పరిస్థితిని ఓ సారి పరిశీలించుకోవాలని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు సూచించారు. గతంలో విశాఖ రాజధాని అన్నారని.. ఇప్పుడు మావిగన్ అంటున్నారని ఎద్దేవా చేశారు. విశాఖపట్నంలో మీడియాతో గంటా శ్రీనివాసరావు మాట్లాడారు. "ఎర్ర బస్సు రాని చోటకు ఎయిర్ బస్సు ఎందుకని జగన్ అన్నారు. ఇప్పుడేమో మిగతా .. 2లో..

### పల్నాడు ఘటన..

## పల్లాకు వివరణ ఇచ్చిన అరవిందబాబు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** పల్నాడు ఎస్పీ కార్యాలయంలో లీగల్ అడ్వైజర్ నియామక ఘటనపై తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను కలిసి నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు వివరణ ఇచ్చారు. స్థానిక పరిస్థితుల దృష్ట్యా అలా చేయాల్సి వచ్చిందని తెలిపారు. ఈ ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహంగా ఉన్నారని పల్లా శ్రీనివాస్.. అరవిందబాబుకు తెలిపారు. పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకొచ్చే ఇలాంటి చర్యలను పార్టీ ఉపేక్షించదని సీఎం మాటగా స్పష్టం చేశారు. స్థానిక మిగతా .. 2లో..

### అప్పుడు వారు నాలుగు

## పెళ్లిళ్లు చేసుకోలేరు

### సివిల్‌కోడ్‌పై అమిత్‌షా



**విశ్వం వాయిస్ న్యూస్ :** అస్సాం అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాజపా అగ్ర నేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొన్నారు. గోల్‌పాడా జిల్లాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో కీలక వ్యాఖ్యలు చేశారు. చొరబాటుదారులు నాలుగు పెళ్లిళ్లు చేసుకోకుండా ఉమ్మడి పౌరస్మృతి ద్వారా అడ్డుకునే వీలు ఉంటుందన్నారు. "ఆదివాసీల అభివృద్ధి కోసం ప్రధాని మోదీ, అస్సాం ముఖ్యమంత్రి రోడ్ మ్యాప్ సిద్ధం చేశారు. మోదీ నాయకత్వంలో ఆదివాసీ మహిళ దేశ ప్రథమ పౌరురాలు అయ్యారు" అని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో యూసీసీని బలవంతంగా రుద్దుతారంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారాన్ని ఆయన మిగతా .. 2లో..

### ఇరిగేషన్ పనుల అంచనాల తయారీలో

## అధికారుల అలసత్వం

అధికారులు తీరు మార్చుకోవాలన్న మంత్రి నిమ్మల - ఆదివారంలోగా అంచనాలు సమర్పించాలని ఆదేశం
సిఈలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి నిమ్మల రామానాయుడు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** గతంలో ప్రభుత్వంలో వ్యవహరించినట్లుగా కాకుండా, ఇరిగేషన్ అధికారులు తీరు మార్చుకోవాలని హెచ్చరించారు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సిఈలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన మంత్రి నిమ్మల నియోజకవర్గాల వారీగా కాలువల్లో తూడు, గుర్రపుడెక్క, పూడికతీత, వంటి పనులకు సంబందించిన అంచనాల తయారీపై సమీక్ష నిర్వహించారు. ఆయా పనులకు సంబందించి మార్చి 25వ తేదీలోపు నియోజకవర్గాల వారీగా మిగతా .. 2లో..

### ఎంఎస్ఎంఈలతో

## యువతకు ఉపాధి

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



**పెనుకొండ/శ్రీసత్యసాయి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో యువతకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో పెద్ద ఎత్తున ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ప్రతి కుటుంబం నుంచి ఒకరిని పారిశ్రామిక వేత్తగా తీర్చిదిద్దాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. ఆసక్తి కలిగిన యువత ముందుకొస్తే సబ్సిడీ రుణాలు అందజేసి, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు ఏర్పాటుకు వెన్నుదన్నుగా ఉంటామన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలంలోని కొండంపల్లి గ్రామంలో ఫెర్టిలైజర్స్, పౌల్ట్రీ ఫీడ్ విక్రయ శాలలను మంత్రి సవిత శుక్రవారం ప్రారంభించారు. అనంతరం తనను కలిసి విలేకరులతో ఆమె మిగతా .. 2లో..

### దక్షిణాసియా టెక్స్‌టైల్స్

## క్యాపిటల్‌గా తెలంగాణ

### సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణ రైజింగ్‌లో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించిన ఆసియా టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. "ఉత్తమ వస్త్రాల రూపకల్పనలో భారత్‌కు గొప్ప చరిత్ర ఉంది. అనేక రంగాల్లో తెలంగాణ అగ్రగామిగా కొనసాగుతోంది. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల మిగతా .. 2లో..

### నిమ్మ రికార్డు..

## 80 కిలోలు రూ.10,000



**పొదలకూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా పొదలకూరు నిమ్మ మార్కెట్లో శుక్రవారం రికార్డు స్థాయి ధరలు పలికాయి. 80 కిలోల బస్తా రూ.10 వేల వరకు పలికింది. పదేళ్ల కాలంలో ఇంత ధర పలికిన దాఖలాలు లేవని రైతులు, వ్యాపారులు చెబుతున్నారు. మార్చి రెండో వారం వరకు గిట్టుబాటు ధరలు లేక తల్లడిల్లారు. జిల్లాలోని మెట్ట ప్రాంతంలో ఎక్కువ మంది నిమ్మ సాగుపై మిగతా .. 2లో..

### నా నోరు నొక్కితే..

## మీరు గెలిచినట్లు కాదు

ఆమ్‌ఆద్మీకి రాఘవ్ చడ్డా మెసేజ్



**విశ్వం వాయిస్ న్యూస్ :** రాజ్యసభలో ఆమ్‌ఆద్మీ పార్టీ ఉపనేతగా ఉన్న రాఘవ్ చడ్డాను ఆ పార్టీ తొలగించడం తీవ్ర వివాదాస్పదమైంది. దీనిపై ఆప్ ఎంపీ రాఘవ్ చడ్డా తాజాగా స్పందించారు. తానేం తప్పు చేశానంటూ పార్టీని బహిరంగంగా ప్రశ్నించారు. ఇలాంటి ప్రయత్నాలతో తన మిగతా .. 2లో..

## వేలాది బలగాలు.. రన్‌వే నిర్మాణం

ఇరాన్ యురేనియం కోసం ట్రంప్ ప్లాన్..?



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఇరాన్ వద్ద ఉన్న సుమారు 450 కిలోల యురేనియంపై కన్నేసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దాన్ని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన ప్లాన్‌ను ఇటీవల అగ్రరాజ్య సైన్యం ట్రంప్ చేతికి ఇచ్చినట్లు తెలిసింది. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ యురేనియంను మిగతా .. 2లో..

### ఇంధన సంక్షోభం..

## అక్కడ ఆఫీసులు సాయంత్రం 4కే క్లోజ్



**ఢాకా, విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ఇంధన కొరతను అధిగమించేందుకు పొరుగు దేశం బంగ్లాదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా అన్ని దుకాణాలు, షాపింగ్‌మాల్స్‌ను సాయంత్రం 6 గంటలకే మూసివేయాలని ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు మిగతా .. 2లో..


### భారత్‌కు మరింత

## ముడిచమురు, ఎల్ఎన్‌జీ : రష్యా



**విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్‌కు ముడి చమురు, సహజ వాయువు సరఫరాను మరింత పెంచడానికి రష్యా ముందుకొచ్చింది. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్, విదేశాంగ మంత్రి జైశంకర్, రష్యా ఉప ప్రధాని డెనిస్ మాంటురోవ్‌ల మధ్య జరిగిన భేటీలో ఇంధన సహకారంపై చర్చ జరిగినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసిన మాంటురోవ్.. చమురు, నేచురల్ గ్యాస్ సరఫరాను పెంచే విషయంపై హామీ ఇచ్చినట్లు తెలిసింది. దీంతోపాటు ఇరు దేశాలు మిగతా .. 2లో..

## దిల్లీలో భూప్రకంపనలు



**విశ్వం వాయిస్ న్యూస్ :** అఫ్గానిస్థాన్‌లో 5.9 తీవ్రతతో సంభవించిన భూకంపం ప్రభావం భారత్‌లోనూ కనిపించింది. దేశ రాజధాని దిల్లీలో పలుచోట్ల భూమి కంపించింది. అలాగే, పంజాబ్, హరియాణా, జమ్మూకశ్మీర్, కార్గిల్‌లోనూ భూ ప్రకంపనలు సంభవించినట్లు తెలుస్తోంది. ఈ ప్రకంపనల ధాటికి శ్రీనగర్‌లోని పలు ఇళ్లలోని ఫ్యాన్‌లు, షాండ్లియర్లు ఊగిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

## డిప్రెషన్‌లో జగన్.. అందుకే 'మావిగన్' వ్యాఖ్యలు : మాధవ్



**విశ్వం వాయిస్ న్యూస్ :** అసెంబ్లీ ఎన్నికల ఓటమి అనంతరం వైకాపా అధినేత జగన్ మానసిక స్థితి సరిగా లేదని భాజపా ఏపీ అధ్యక్షుడు మాధవ్ అన్నారు. రాష్ట్రాభివృద్ధి, అమరావతికి చట్టబద్ధత చూసి జగన్ డిప్రెషన్‌లోకి వెళ్లారని విమర్శించారు. రాజధాని అంశంలో అర్థం లేకుండా జగన్ 'మావిగన్' అని మాట్లాడటానికి ఇది పరాకాష్ఠ అన్నారు. పార్లమెంట్‌లో అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదానికి సహకరించిన వారికి మాధవ్ ధన్యవాదాలు తెలిపారు.

### ఇరాన్‌తో యుద్ధం వేళ..

## అమెరికా ఆర్మీ చీఫ్‌పై వేటు



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఇరాన్‌పై భీకర దాడులు కొనసాగుతోన్న వేళ ఓ కీలక పరిణామం చోటు చేసుకుంది. అమెరికా సైన్యాధిపతి జనరల్ ర్యాండీ జార్జ్‌ని పదవి నుంచి వైదొలగాలని రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ కోరగా, ఆయన వెంటనే వైదొలిగినట్లు సమాచారం. ఈ విషయాన్ని పెంటగాన్ వర్గాలు కూడా ధ్రువీకరించాయి. ఆర్మీలోని అత్యున్నతస్థాయి అధికారిని పదవి నుంచి వైదొలగాలని హెగ్సెత్ కోరినట్లు తెలిపాయి. రక్షణ విభాగాన్ని పునరుద్ధరించేందుకు హెగ్సెత్ వేగంగా చర్యలు తీసుకుంటున్నారు. అందులోభాగంగానే ఇప్పటివరకు డజను మందికి పైగా మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

మానసిక పరిస్థితిని

## జగన్ పరిశీలించుకోవాలి

భోగాపురం ఎయిర్‌పోర్టును తానే తెచ్చానంటున్నారు. ఆర్సెలార్ మిత్తల్ కూడా తానే తెచ్చానని చెప్తున్నారు. 2026 జూన్ నాటికి భోగాపురం ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వస్తోంది. ఎయిర్‌పోర్టు ప్రారంభమయ్యాక ఉత్తరాంధ్ర రూపురేఖలు మారిపోతాయి. అమరావతికి చట్టబద్ధత బిల్లు ఆమోదానికి సహకరించిన అన్ని పార్టీలకు ధన్యవాదాలు"అని గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

## పల్లాకు వివరణ ఇచ్చిన అరవిందబాబు

పరిస్థితులు ఎలా ఉన్నప్పటికీ.. ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర అధ్యక్షుడితో మాట్లాడి సమన్వయం చేసుకోవాలే తప్ప ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదని సీఎం మాటగా పల్లా తేల్చి చెప్పారు.

దక్షిణాసియా టెక్స్‌టైల్స్

## క్యాపిటల్‌గా తెలంగాణ

ఆర్థిక వ్యవస్థగా మార్చడమే మా లక్ష్యం. పెట్టుబడిదారులకు కావాల్సిన అన్ని సౌకర్యాలూ కల్పిస్తాం. టెక్స్‌టైల్స్ కేవలం పరిశ్రమే కాదు.. చేనేతలకు జీవితం. దక్షిణాసియా టెక్స్‌టైల్స్ క్యాపిటల్‌గా తెలంగాణను తీర్చిదిద్దుతాం. ప్రపంచంలోనే ఫిల్మ్ ప్రొడక్షన్ డెస్టినేషన్‌గా హైదరాబాద్ మారింది. చిత్ర పరిశ్రమను ప్రోత్సహిస్తాం. పర్యావరణ పరిరక్షణే మా తొలి ప్రాధాన్యం" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

ఇంధన సంక్షోభం..

## అక్కడ ఆఫీసులు సాయంత్రం 4కే క్లోజ్

కార్యాలయాల్లో పనిగంటలను సైతం ఓ గంట తగ్గించింది. ఇక మీదట సాయంత్రం ఐదు గంటలకు బదులు 4 గంటలకే అన్ని కార్యాలయాలూ మూత పడనున్నాయి. బ్యాంకింగ్ లావాదేవీలు సైతం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకే అనుమతించనున్నారు. సాయంత్రం 4 గంటలకు బ్యాంకులు కూడా మూతపడనున్నాయి. హోటళ్లు, ఫార్మసీలు, అత్యవసర సేవలు, నిత్యావసర వస్తు మార్కెట్లను మాత్రం ఈ ఆంక్షల నుంచి మినహాయించారు. ఈ మేరకు బంగ్లా ప్రధాని తారిఖ్ రెహ్మాన్ నేతృత్వంలో జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు ఇంధన కొరత నేపథ్యంలో బంగ్లాదేశ్ అభ్యర్థన మేరకు భారతదేశం ఇప్పటికే 5,000 టన్నుల డీజిల్‌ను ఆ దేశానికి సరఫరా చేసింది. రాబోయే నాలుగు నెలల్లో మరో 50,000 మెట్రిక్ టన్నుల డీజిల్‌ను సరఫరా చేయాలని భారత ప్రభుత్వాన్ని అభ్యర్థించింది. ఆ విన్నపాన్ని పరిశీలిస్తున్నామని కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణ్‌దీర్ జయస్వాల్ పేర్కొన్నారు. ఒక్క బంగ్లాదేశ్ మాత్రమే కాదు.. శ్రీలంక, మాల్దీవులు వంటి ఇతర పొరుగు దేశాలు కూడా ఇంధనం కోసం భారత్‌ను ఆశ్రయించాయి.

అప్పుడు వారు నాలుగు

## పెళ్లిళ్లు చేసుకోలేరు

తిప్పికొట్టారు. ఈ సందర్భంగా ఇటీవల మేఘాలయలో తలెత్తిన ఉద్రిక్తతలను ప్రస్తావించారు. చొరబాటుదారులు అక్కడి ఆదివాసీ మహిళలను వివాహం చేసుకోవడం ద్వారా రాజకీయ పలుకుబడిని సంపాదించడానికి ప్రయత్నించారని, ఇది ఉద్రిక్తతలకు దారితీసిందని ఆయన ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే.. అక్రమ చొరబాట్ల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. "అస్సాంలో మాకు మరో ఐదేళ్ల సమయం ఇవ్వండి. రాష్ట్రానికి చొరబాటుదారుల నుంచి విముక్తి కల్పించేలా చర్యలు తీసుకుంటాం. అస్సాంలో యూసీసీని అమలు చేస్తాం. దాంతో చొరబాటుదారులు నాలుగు పెళ్లిళ్లు చేసుకోలేరు" అని వెల్లడించారు.

ఇరిగేషన్ పనుల అంచనాల తయారీలో

## అధికారుల అలసత్వం

అంచనాలు రూపొందించి పంపించాలని ఆదేశించినా, ఇప్పటి వరకు కొంత మంది చీఫ్ ఇంజనీర్లు సరిగా అంచనాలు సమర్పించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారాయన. కాలువల్లో తూడు, గుర్రపుడెక్క, మట్టి పూడిక తీత వంటి పనులు చేయడానికి ఏప్రియల్, మే, నెలలో మాత్రమే అవకాశం ఉంటుంది. ఆతరువాత ఖరీఫ్ సీజన్ మొదలైతే పనులు చేయడానికి అవకాశం ఉండదని, గతంలో ఏప్రియల్, మే నెలలో చేయాల్సిన పనులకు జూన్ లో అనుమతులు ఇచ్చేవారని, పనులు మొదలుపెట్టిన వెంటనే కాలువలకు నీళ్ళు వదిలేవారని, దీంతో పనులు సగంలోనే వదిలేయాల్సి వచ్చేదని గుర్తు చేశారు. ఇలా చేయడం వల్ల ఆయకట్టు చివరన ఉన్న పొలాలకు సాగు నీరందక రైతులు ఇబ్బందిపడాల్సి వస్తుందని, ఇలా గతంలో వ్యవహరించిన తీరులో కాకుండా ముందుగానే అంచనాలు రూపొందించి, ఆర్థిక శాఖ అనుమతులు పొందితే సీజన్ మొదలయ్యేలోగా పనులు కూడా పూర్తి చేయడానికి అవకాశం ఉంటుందని అన్నారు. కావున నియోజకవర్గాల వారీగా పనులకు సంబందించిన అంచనాలను ఆదివారం సాయంత్రం లోగా పంపాలని సిఈలను ఆదేశించారు. గడువులోగా అంచనాలను పంపని అధికారులు సోమవారం అమరావతి సచివాలయంకు వచ్చి అంచనాలు ఎందుకు పంపలేకపోయారో సంజాయిషీ ఇచ్చుకోవలసి ఉంటుందని తీవ్రంగా హెచ్చరించారు మంత్రి నిమ్మల రామానాయుడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అత్యవసర పనుల కింద నిధులు విడుదల చేసి, కాలవల్లో పూడిక తీత, తూడు, గుర్రపుడెక్క తొలగింపు వంటి పనులను చేయడం ద్వారా ఆయకట్టు రైతులకు సాగునీరందించగలిగామని తెలిపారు. గత 5ఏళ్ళ వైసిపి ప్రభుత్వ పాలనలో కనీస నిర్వహణ పనులు సైతం పట్టించుకోకపోవడంతో ఆయకట్టు చివరి ఎకరం వరకు నీరందక రైతులు ఇబ్బంది పడ్డారని, నేడు కూటమి ప్రభుత్వం ప్రతి ఎకరాకు సాగు నీరందించడమే లక్ష్యంగా పెట్టుకుని పని చేస్తున్నామని స్పష్టం చేశారు. కావున అధికారులు నిర్లక్ష్యం వదిలి గడువులోగా ఇరిగేషన్ పనులకు సంబందించిన అంచనాలు సమర్పించి, సీజన్ మొదలయ్యేలోగా, నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఎంఎస్‌ఎంఈలతో

## యువతకు ఉపాధి

మాట్లాడుతూ, రాష్ట్రంలో యువతకు ఉపాధి కల్పనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా 2029 నాటికి 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు రేయింబవళ్లు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటి నుంచి ఒకరిని పారిశ్రామిక వేత్తగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో, రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఎంఎస్‌ఎంఈలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన యువతతో చిన్న, మధ్యతరహా పరిశ్రమ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం సబ్సిడీ రుణాలు అందజేసి, వారికి వెన్నుదన్నుగా నిలువనుందని మంత్రి సవిత వెల్లడించారు.

**కూటమి రాకతో పంచాయతీలకు పూర్వవైభవం**

వైసీపీ పాలనలో నిధుల లేమితో పంచాయతీల్లో పాలన పడకేసిందని మంత్రి సవిత మండిపడ్డారు. పాడైపోయిన వీధి బల్బులను సైతం మార్చడానికి కూడా వీలుండేది కాదన్నారు. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో ఎందరో వైసీపీ సర్పంచులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, మరెందరో చేసిన అప్పులు తీర్చడానికి కూలీలుగా మారిపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులను ఆనాటి జగన్ ప్రభుత్వం పక్కదారి పట్టించారన్నారు. పంచాయతీలను దౌర్జన్యంగా గెలిపించుకోవడంలో ఉన్న శ్రద్ధ నిధులివ్వడంపై లేదని జగన్ నుద్దేశించి విమర్శించారు. కూటమి ప్రభుత్వం రాకతో పంచాయతీలకు పూర్వవైభవం ప్రారంభమైందన్నారు. కేంద ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులు నేరుగా పంచాయతీలకే అందజేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 22 నెలల కాలంలో గ్రామాల్లో గతంలో ఎన్నడూ జరగలేనంత అభివృద్ధి చోటుచేసుకుందన్నారు. 2025-26కు సంబంధించి గ్రామాల్లో జరిగిన అభివృద్ధికి గానూ ప్రతిష్టాత్మక అయిదు కేంద్ర ప్రభుత్వ అవార్డులను ఏపీ పంచాయతీరాజ్ శాఖ గెలుచుకుందన్నారు. ఇదీ కూటమి ప్రభుత్వం పాలనకు మచ్చుతునక అని మంత్రి సవిత తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 80 కిలోలు రూ.10,000

ఆధారపడి జీవిస్తున్నారు. జనవరిలో కనీస ధర లేకపోవడంతో.. రైతులు నష్టపోకూడదని, ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ మార్కెటింగ్‌శాఖ ద్వారా కిలో ఎనిమిది రూపాయలకు కొనుగోలు చేసి వివిధ ప్రాంతాలకు తరలించారు. తాజాగా కిలో రూ.125 వరకు విక్రయించారు. ఈశాన్య రాష్ట్రాల్లో కురుస్తున్న మంచు, చలి వాతావరణానికి ధరలు ఆశాజనకంగా లేకపోయినా.. ఇపుడిప్పుడే ధరలు పెరుగుతున్నాయని ఎగుమతిదారులు తెలిపారు.

## మీరు గెలిచినట్లు కాదు

గళాన్ని అణచివేయగలరేమో గానీ.. తనను ఓడించలేరంటూ ఓ వీడియో సందేశం విడుదల చేశారు. "పార్లమెంట్‌లో నాకు ఎప్పుడు మాట్లాడే అవకాశం లభించినా.. ప్రజా సమస్యలనే లేవనెత్తుతా. బహుశా నేను ప్రస్తావించే అంశాలను సభలో సాధారణంగా చర్చించరేమో. కానీ, ప్రజా సమస్యలను ఎత్తిచూపడం ఏమైనా నేరమా? నేనేమైనా తప్పు చేశానా? పార్లమెంట్‌లో నాకు మాట్లాడే అవకాశం ఇవ్వొద్దని మా పార్టీ స్వయంగా రాజ్యసభ సెక్రటరీకి చెప్పింది. అందుకే ఈ రోజు నేను ఈ ప్రశ్నలు అడగాల్సి వచ్చింది. ఎయిర్‌పోర్టుల్లో ఆహార ధరలు, గిగ్ వర్కర్ల సమస్యలు, టోల్ ప్లాజా దోపిడీ, టెలికాం కంపెనీల రీఛార్జ్ విధానాల సమస్యలను లేవనెత్తితే.. అది ఆమ్‌ఆద్మీ పార్టీకే ప్రయోజనం కదా. దీనివల్ల పార్టీకి ఏం నష్టం జరుగుతోంది? ఎందుకు నన్ను మాట్లాడకుండా అడ్డుకుంటున్నారు? ఇలాంటి చర్యలతో నా గళాన్ని మీరు అణచివేయగలరు. కాని, ఇది నా ఓటమి కాదు. ప్రజలు నా పక్షాన ఉన్నారు. వారికోసం ఎంత దూరమైనా వెళ్తా. నేను నది లాంటి వాడిని. సమయం వచ్చినప్పుడు వరదలా విరుచుకుపడతా" అని రాఘవ్ చడ్డా తన వీడియోలో పేర్కొన్నారు. రాజ్యసభలో ఆమ్‌ఆద్మీ పార్టీ డిప్యూటీ లీడర్‌గా రాఘవ్ చడ్డాను తొలగించిన ఆప్.. ఆ హోదాలో మరో ఎంపీ అశోక్ మిత్తల్‌ను నియమించింది. ఆప్ నిర్వహిస్తున్న కార్యకలాపాలకు చడ్డా దూరంగా ఉంటుండటం, పార్టీ కార్యక్రమాలపై స్పందించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. రాఘవ్ చడ్డా భాజపాలో చేరనున్నట్లు ఊహాగానాలు వినిపిస్తోన్న వేళ ఈ పరిణామాలు చోటుచేసుకోవడం తీవ్ర చర్చనీయాంశమైంది.

## వేలాది బలగాలు.. రన్‌వే నిర్మాణం

తరలించడం చాలా క్లిష్టమైన ప్రక్రియ అని, ఇందుకోసం ప్రత్యేకంగా రన్‌వేను నిర్మించాల్సిన అవసరం ఉందని అమెరికా మిలిటరీ వెల్లడించినట్లు సమాచారం. ఇరాన్ అణుస్థావరాలే లక్ష్యంగా గతేడాది అమెరికా దాడులు జరిపిన సంగతి తెలిసిందే. ఆ దాడుల్లో ఇస్ఫహాన్, నతాంజ్ అణుక్షేత్రాలు దెబ్బతిన్నాయి. ఆ తర్వాత నుంచి ఇరాన్ వద్ద ఉన్న 450 కిలోల యురేనియం ఆచూకీ గల్లంతైంది. 60శాతం శుద్ధి చేసిన ఈ యురేనియం అణుస్థావరాల శిథిలాల కింద ఉండొచ్చని అమెరికా విశ్వసిస్తోంది. దాన్ని స్వాధీనం చేసుకునేందుకు టెహ్రాన్‌తో చర్చలు జరపాలని భావిస్తోంది. ఒకవేళ ఇరాన్ అందుకు అంగీకరించకపోతే.. బలవంతంగానైనా దాన్ని తరలించేందుకు ఆపరేషన్ చేపట్టాలని యోచిస్తోంది. ఇందులోభాగంగానే అమెరికా సైన్యం ఓ మిలిటరీ ప్లాన్ సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ రేడియో ధార్మిక పదార్థాన్ని తరలించాలంటే వేలాది మంది ప్రత్యేక శిక్షణ కలిగిన సైనికులను ఇరాన్‌కు తరలించాల్సి ఉంటుంది. యురేనియం తవ్వకం కోసం పరికరాలను కూడా వాయుమార్గంలో తీసుకురావాలి. దాన్ని వెలికితీసిన తర్వాత కార్గో విమానాల్లో ఇరాన్ వెలుపలికి తరలించాలని అమెరికా సైన్యం ప్రణాళిక రూపొందించింది. ఇందుకోసం నతాంజ్ వంటి అణుస్థావరాల వద్ద రన్‌వే నిర్మించాల్సిన అవసరం ఉంటుందని తెలిపింది. అయితే, ఇలాంటి ఆపరేషన్లు సైనికులకు అత్యంత ప్రమాదంతో కూడుకున్నవని, వీటిని నిర్వహించేందుకు కొన్ని వారాల సమయం పట్టొచ్చని అణు, రక్షణరంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది సాధ్యమే అయినా, కాల్పుల విరమణ ఒప్పందం కింద ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ సిబ్బంది సాయంతో దీన్ని వెలికితీస్తే మంచిదని అమెరికా రిటైర్డ్ జనరల్ ఒకరు అభిప్రాయపడ్డారు. ఈ ఆపరేషన్‌లో కొన్నిసార్లు ప్రాణనష్టం కూడా జరగొచ్చని హెచ్చరించారు. కాగా.. ఈ మిలిటరీ ప్లాన్‌పై వైట్‌హౌస్ అధికార ప్రతినిధి కరోలిన్ లివిట్ స్పందించారు. కేవలం ప్రణాళిక మాత్రమే అమెరికా అధ్యక్షుడి వద్దకు వెళ్లిందని, దానర్థం ఆ ఆపరేషన్‌పై ఆయన నిర్ణయం తీసుకున్నట్లు కాదని తెలిపారు. ఇరాన్‌లో ఇంకా విధ్వంసం మొదలుకాలేదని, రానున్న వారాల్లో అత్యంత భీకర దాడులు ఉంటాయని ట్రంప్ ఇటీవల బెదిరించిన సంగతి తెలిసిందే.

భారత్‌కు మరింత

## ముడిచమురు, ఎల్‌ఎన్‌జీ : రష్యా

తమ ద్వైపాక్షిక సంబంధాలను మరింత పెంపొందించుకోవడానికి అంగీకరించినట్లు సమాచారం. హర్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేసిన తర్వాత ప్రపంచ వ్యాప్తంగా ముడి చమురు, గ్యాస్ సంక్షోభం ఏర్పడింది. ఈ క్రమంలోనే భారత్‌లో పర్యటించిన రష్యా బృందం.. ప్రధాని మోదీ సహా పలువురు నేతలతో భేటీ అయ్యింది. ఈ సందర్భంగా ఇంధనం, ఎరువులు, వాణిజ్యం తదితర అంశాలపై చర్చించారు. గతేడాది ఇరుదేశాల మధ్య జరిగిన ఒప్పందాల అమలుపై సమీక్షించినట్లు భారత విదేశాంగశాఖ ఓ ప్రకటనలో తెలిపింది.

ఇరాన్‌తో యుద్ధం వేళ..

## అమెరికా ఆర్మీ చీఫ్‌పై వేటు

ఉన్నతస్థాయి జనరల్స్‌ను, అడ్మిరల్స్‌ను పదవి నుంచి తొలగించారు. పదాతిదళ అధికారి అయిన జార్జ్ వెస్ట్‌పాయింట్ మిలిటరీ అకాడమీ నుంచి గ్రాడ్యుయేట్ పట్టా పొందారు. మొదట గల్ఫ్ యుద్ధంతో సహా ఇరాక్, అఫ్గానిస్థాన్‌లలో కూడా సేవలందించారు. జో బైడెన్ హయాంలో 2021-2022 వరకు రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్‌కు సహాయకుడిగా పనిచేశారు. గతేడాది ఫిబ్రవరిలో అనేకమంది ఉన్నతస్థాయి అధికారులను హెగ్సెత్ పదవి నుంచి తొలగించారు. నాడు జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్‌గా ఉన్న జనరల్ చార్లెస్ సీక్యూ బ్రౌన్‌పై ట్రంప్ వేటు వేశారు. అప్పటినుంచి ఉన్నతస్థాయి సైనిక జనరల్స్, అడ్మిరల్స్ ముందస్తు పదవీవిరమణ చేయడం లేదా బాధ్యతల నుంచి తొలగించడం వంటివి చోటుచేసుకున్నాయి. ఆ సమయంలో తొలగింపుల నుంచి జార్జ్ బయటపడగా.. తాజాగా ఆయన కూడా పదవి నుంచి వైదొలిగారు. ఆకస్మిక పదవీ విరమణ నేపథ్యంలో అమెరికా సైన్యం.. ర్యాండీ సేవలను కొనియాడుతూ ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలిపింది.

**వ్యక్తిగత ఆయుధాలు తీసుకెళ్లేందుకు అనుమతి**

ఇదిలాఉండగా.. యూఎస్ దళాల రక్షణ కోసం హెగ్సెత్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న సైనిక స్థావరాల్లోకి వ్యక్తిగత ఆయుధాలు తీసుకెళ్లేందుకు సైనికులకు అనుమతిస్తున్నట్లు పేర్కొన్నారు. దళాల వ్యక్తిగత రక్షణను దృష్టిలోపెట్టుకొని ఈ అనుమతులు జారీ చేస్తున్నట్లు ఆయన ఓ వీడియోలో పేర్కొన్నారు.

## దేశానికి ఫ్యూచర్ సిటీ అమరావతి

నిలిచాయి. లోక్ సభ, రాజ్యసభలో ప్రాతినిధ్యం వహిస్తూ 50 పార్టీలు ఉంటే వాటిల్లో వైసీపీ మినహా అన్ని పార్టీలు అమరావతికి మద్దతు ఇచ్చాయి. రాష్ట్రపతి ఆమోదం తర్వాత దీనికి పూర్తి స్థాయి చట్టబద్ధత వస్తుంది. అన్ని విధాలా సహకరించిన ప్రధాని మోదీకి, హోం మంత్రి అమిత్ షాకు ధన్యవాదాలు. లోక్ సభ స్పీకర్, రాజ్యసభ ఛైర్మన్ పార్లమెంటులో ఉండే అన్ని రాజకీయ పార్టీలు, ఎంపీలకు కృతజ్ఞతలు. రాజకీయ వైరుధ్యాలు, వ్యక్తిగతంగా భిన్నాభిప్రాయాలున్నా అన్ని పార్టీలు సహకారం ఇచ్చాయి. కొందరికి రాష్ట్రం గురించి తెలియదు.. ఈ రాష్ట్రంతో అవసరం కూడా ఉండకపోవచ్చు...కానీ అలాంటి పార్టీలు కూడా రాజధాని చట్ట బద్ధత కల్పించే బిల్లుకు సహకరించాయి. అనుకూలంగా ఓటేశాయి. కానీ ఈ రాష్ట్రంలో ఓట్లు పొంది, ఇక్కడి నుంచి ఎంపీలుగా ఎన్నికైన వ్యక్తులు ఈ రాష్ట్రానికే ద్రోహం చేసేలా వ్యవహరించారు. అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లును వ్యతిరేకించారు. దేశంలోని పార్టీలన్నీ ఓవైపు ఉంటే... వైసీపీ మాత్రం మరోవైపు నిలిచింది. వైసీపీ మాత్రమే రాష్ట్ర ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించింది. దేశ ప్రయోజనాలు కాపాడేందుకు ప్రాంతీయ పార్టీలు సహకరిస్తాయి. కానీ రాష్ట్రం నాశనమైనా పర్వాలేదనే రీతిలో జగన్ సూచనల మేరకు వైసీపీ ఎంపీలు వ్యవహరించారు. అమరావతి నాశనమై పోయినా పర్వాలేదనుకున్నారు. కానీ మనం దానిపై శాసనం చేసుకున్నాం. కేంద్ర ప్రభుత్వ రాజ ముద్రతో 5 కోట్ల ఆంధ్రుల ప్రజల ఆశలు, ఆశయాలు నెరవేరాయి. అమరావతిని ఇక భవిష్యత్తులో ఎవరూ ఏమీ చేయలేరు."అని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు.

**ప్రతీ ఇటుకా పేర్చుకుంటూ వచ్చాం...**

"విభజన సమయంలో రెండు రాష్ట్రాల్లోనూ భావోద్వేగాలు ఉన్నాయి. చాలా అంశాలకు పరిష్కారం చూపకుండానే విభజన జరిగింది. ఆర్థిక కష్టాలు, రాజధాని లేదు, వనరులు లేవు అన్నీ ఇబ్బందులే. అప్పాయింటెడ్ డే జూన్ 2 కంటే ముందే పోలవరం 7 ముంపు మండలాలు ఏపీలో కలపాలని కోరాను. రాజధాని లేకుండా విజయవాడకు వచ్చాం. ఇరిగేషన్ ఎస్ఈ కార్యాలయంలో ఆఫీసు ఏర్పాటు చేసుకుని, బస్సులో బస చేసి కార్యకలాపాలు ప్రారంభించాం. శివరామకృష్ణన్ కమిటీని కేంద్రం ఏర్పాటు చేస్తే 46 శాతం మంది ప్రజలు విజయవాడ- గుంటూరు మధ్య రాజధానికి ఏర్పాటుకు అనుకూలమన్నారు. ఆ సంకల్పంలో భాగమే ఉత్తరాంధ్ర-దక్షిణాంధ్ర, రాయలసీమల మధ్య సమాన దూరంలో ప్రాంతాన్ని ఎంపిక చేశాం. కనెక్టివిటీ పరంగా, భౌగోళికంగా, చారిత్రత్మక ప్రదేశంగా రాజధానిగా ఎంపిక చేసి ప్రణాళికలు చేశాం. అమరావతి ప్రాంతాన్ని రాజధానిగా ఎంపిక, భూ సమీకరణ, సింగపూర్ సహకారంతో మాస్టర్ ప్లాన్ రూపకల్పన చేశాం. సింగపూర్ ఒక్క పైసా తీసుకోకుండా మాస్టర్ ప్లాన్ రూపొందించి ఇచ్చింది. పిలుపు ఇవ్వగానే 29 వేల మంది రైతులు 34 వేల ఎకరాలను ఇచ్చారు. ప్రభుత్వ భూమి కూడా కలిపితే 54 వేల ఎకరాలు అందుబాటులోకి వచ్చింది. అభివృద్ధిలో రైతులను కూడా భాగస్వాములను చేసేలా వినూత్నమైన ల్యాండ్ పూలింగ్ స్కీమ్ తెచ్చాం. తమ భవిష్యత్తు బాగుంటుందని రైతులకూ విశ్వాసం కలిగింది. జరీబు భూములిచ్చిన వారికి 450 కమర్షియల్, 1000 గజాలు రెసిడెన్షియల్ రిటర్నబుల్ ప్లాట్లు ఇచ్చాం. ప్రతీ ఏటా యాన్యుటీ కూడా రైతులకు ఇస్తున్నాం. భూమి లేని రైతులకు కూడా పెన్షన్లు అదనంగా ఇస్తున్నాం. భూములు ఇచ్చిన వారంతా సంతోషంగా ఉండాలన్న లక్ష్యంతోనే ఇవన్నీ చేశాం. సిటీ రీజియన్ 56 మండలాలు, 8603 చదరపు కిలోమీటర్ల మేర, 117 చదరపు కిలోమీటర్ల క్యాపిటల్ సిటీని నిర్దేశించాం. సింగపూర్ మాస్టర్ ప్లాన్ తో నిర్మాణం ప్రారంభించేందుకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. దేశంలో ఉండే పవిత్రమైన దేవాలయాలు, ప్రార్థనా లయాల నుంచి మట్టిని, నదుల నుంచి నీటిని తెప్పించాం. ప్రధాని కూడా పార్లమెంటు నుంచి మట్టిని, యమునా జలాలను తీసుకువచ్చారు. పార్లమెంటు, యావత్ దేశం అంతా అండగా ఉంటుందనే ఆ మట్టిని, నీటిని తెచ్చినట్టు ప్రధాని చెప్పారు. 11 నెలల్లో సచివాలయం, అసెంబ్లీ భవనాలను నిర్మించాం. 2016 జూన్ నుంచే ప్రభుత్వ కార్యకలాపాలన్నీ అమరావతి నుంచే నిర్వహించాం. 9 నగరాలుగా అమరావతిని నిర్మించాలని ప్రణాళికలు చేశాం. నాలుగు ఆఫీసు భవనాలు నిర్మిస్తే రాజధాని అయిపోదు. భవిష్యత్ తరాలు శాశ్వతంగా రాజధాని ప్రాంతాన్ని వినియోగించుకోవాలి. ప్రపంచ శ్రేణి ఆర్కిటెక్టులను నియమించాం. నార్మన్ ఫోస్టర్స్ ద్వారా బ్లూ గ్రీన్ సిటీగా అమరావతిని అధునాతన నగరంగా తీర్చిదిద్దేలా ప్రణాళికలు చేశాం. స్టాక్ ఎక్స్చేంజిలో అమరావతి బాండ్స్ విడుదల చేస్తే గంటలో రూ. 2 వేల కోట్లు వచ్చాయి. అంతటి క్రెడిబులిటీని అమరావతి నగరం సొంతం చేసుకుంది."అని సీఎం చంద్రబాబు వివరించారు.

**వైసీపీవి కుళ్లు...కుట్రలు..కుతంత్రాలు**

"రాజధాని విషయంలో వైసీపీ చాలా డ్రామాలు ఆడింది. అమరావతిని వ్యతిరేకించినా గత పాలకులు గతిలేని పరిస్థితిలో ఇక్కడి నుంచే పాలన సాగించారు. వాళ్లు అడుగడుగునా కుట్రలు, కుతంత్రాలు చేస్తూనే ఉన్నారు. అమరావతికి అనుకూలంగా అడుగు పడిన సమయంలోనే రెచ్చగొట్టే ప్రయత్నాలు చేశారు. అమరావతిపై వ్యతిరేకతతో ప్రపంచబ్యాంకుకు కూడా లేఖలు రాశారు. అరాచకం సృష్టించే ప్రయత్నించారు. అరటి తోటలు తగుల బెట్టారు. తప్పుడు రిపోర్టులు తెప్పించారు. ఎడారి, శ్మశానం అన్నారు. భూకంపాలు వస్తాయన్నారు. ఎన్ని విధాల రాజధానిని నష్టపరచాలో అంతా చేశారు. ఇప్పటికీ చేస్తూనే ఉన్నారు. సింగపూర్ దేశం పైనా అభాండాలు వేసి ఒప్పందాలు రద్దు చేశారు. అమరావతి బ్రాండ్ దెబ్బతీశారు. విట్,ఎస్ఆర్ఎం లాంటి ప్రతిష్టాత్మక వాటి పేర్ల చివరిలో అమరావతి క్యాంపస్ అని పెడితే దానిని తీసేయమని వారిపై ఒత్తిడి తెచ్చారు. 1,307 ఎకరాలను 113 సంస్థలకు రాజధానిలో భూములు కేటాయించాం. వేల మంది కార్మికులతో ముమ్మరంగా పనులు జరిగే సమయంలో వాటిని ఆపేశారు. మూడు రాజధానుల ప్రకటన చేసి.. మూడు ప్రాంతాల్లో వివాదం సృష్టించేలా ప్రయత్నించారు. హైకోర్టు కూడా దీనిపై వారికి మొట్టి కాయలు వేసింది. అమరావతి రైతుల ఉద్యమానికి కౌంటర్ గా పెయిడ్ ఆర్టిస్టులతో క్యాంపులు పెట్టించారు. ఎస్సీలపైనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్టు కేసులు పెట్టించారు. నాపై రాళ్లు వేయించారు. అదేమంటే భావప్రకటన స్వేచ్ఛ అని డీజీపీతో మాట్లాడించారు. పవన్ కల్యాణ్ వస్తే ముళ్లకంచెలు అడ్డం పెట్టారు. రాజధానిపై కుట్రలు చేసిన వ్యక్తిని, ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా వ్యవహరించిన వ్యక్తిని నియంత అనాలా లేక ఏమనాలో తెలీటం లేదు. ఈ కుట్రలను కుతంత్రాలను ప్రజలు విశ్వసించలేదు. మాకు మళ్లీ ప్రజలు పట్టం కట్టారు."అని సీఎం చెప్పారు.

**అమరావతి భవిష్యత్ నగరం**

"భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన తొట్టతొలి రాష్ట్రానికి రాజధాని లేకుండా పోయింది. అందుకే ఈ తీర్మానం పెట్టి పార్లమెంటుకు పంపితే.. దానికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. విద్య, ఉద్యోగం, విజ్ఞానం లాంటి అంశాలకు నెర్వ్ సెంటర్ గా అమరావతి మారుతుంది. దేశానికి ఒక ఫ్యూచర్ సిటీ కూడా అవసరం.. అదే అమరావతి. అమరావతి అభివృద్ధితో పాటు విశాఖ, తిరుపతి లాంటి ప్రాంతాలను కూడా అభివృద్ధి చేస్తున్నాం. రీజియన్లుగా ఆయా ప్రాంతాల్లో వేర్వేరు పరిశ్రమలు వస్తున్నాయి. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ లాంటి పరిశ్రమలు వస్తున్నాయి. సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి నీటి భద్రత తీసుకువస్తాం. ఒంటిమిట్టలో శ్రీరామ కల్యాణంలో పాల్గొన్న వేళ లోక్ సభలో అమరావతి చట్టబద్ధత కల్పించే బిల్లు ఆమోదం పొందింది. నిన్న రాజ్యసభలో బిల్లు పాస్ అయిన వేళ పోలవరం డయాఫ్రామ్ వాల్ కూడా పూర్తి అయ్యింది. శుభపరిణామాలు వరుసగా జరుగుతున్నాయి. గత పాలకులు నిలిపిన అమరావతి నిర్మాణాల్ని మళ్లీ మేం అధికారంలోకి వచ్చాక ప్రధాని మోదీ చేతుల మీదుగా పునర్నిర్మాణం మొదలు పెట్టాం. స్వాతంత్ర్య భారత దేశంలో మూడు రాజధానుల డ్రామా ఆడిన వ్యక్తులు ఎవరూ లేరు. అమరావతి దేశానికి ప్రైడ్ గా నిలుస్తుంది. ఆంధ్రప్రదేశ్ కు గుండె, ఆత్మ ఇది. ఎవరు ఏమి చేసినా అమరావతి సంకల్పం ఆగదు, ప్రపంచ బ్యాంకు, హడ్కో, ఏడీబీ నుంచి ఫైనాన్షియల్ టై అప్ ఉంది. ప్రస్తుతం రూ.56 వేల కోట్ల విలువైన పనులు రాజధానిలో జరుగుతున్నాయి. 2028 నాటికి రాజధానిలో ప్రధాన మైన పనులన్నీ ఓ కొలిక్కి వస్తాయి. రాజధానికి లక్షల కోట్లు కావాలని కొందరు మాట్లాడుతున్నారు. కానీ నిర్మాణం ఒక్క రోజులో పూర్తి అయ్యేది కాదు. ఇన్నర్ రింగ్ రోడ్, అవుటర్ రింగ్ రోడ్, స్పోర్ట్స్ సిటీ ఇలాంటి వేర్వేరు ప్రాజెక్టులు నిర్మితం అవుతూనే ఉంటాయి. క్రమానుగుణంగా రాజధాని నిర్మాణం, అభివృద్ధి జరుగుతుంది. కార్యకలాపాలు, ఆర్థిక లావాదేవీలతోనే ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. హైదరాబాద్ ఒక్కటే తెలంగాణాలో గరిష్ట ఆదాయాన్ని ఆర్జించి పెడుతోంది. మౌలిక సదుపాయాల నిర్మాణం పూర్తి అయితే అభివృద్ధి ఆటో పైలట్ గా జరిగిపోతుంది. ప్రపంచంలోని వేర్వేరు ప్రాజెక్టులు ఈ మోడల్ లోనే అభివృద్ధి అయ్యాయి. 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతాం. దానికి చోదకశక్తిగా అమరావతి నిలుస్తుంది. 2029లో ప్రధాని మోదీతో ఈ ప్రాజెక్టులన్నీ ప్రారంభింపచేస్తాం. అమరావతి అజేయం, శాశ్వతం, అన్ స్టాపబుల్. దీనికి అడ్డంకి కలిగించాలని చూస్తే వారివి పగటి కలలుగానే మిగిలిపోతాయి. అమరావతి ప్రజా రాజధాని. రాష్ట్రంలోనూ, రాజధానిలోను ప్రజలు నిత్యం ఆనందంగా ఉండేలా చూడాలని నేను నిత్యం భగవంతుడిని వేడుకుంటూనే ఉంటాను."అని ముఖ్యమంత్రి తెలిపారు.

# ఎడిటర్ వాయిస్

## ఇలా అయితేనే.. అమరావతి 'శాశ్వతం'!

అమరావతికి చట్టబద్ధత కల్పిస్తే.. అది శాశ్వత రాజధాని అవుతుందని ప్రభుత్వం చెబుతున్న వాదన బాగానే ఉన్నప్పటికీ.. శాశ్వత నిర్మాణాలు కల్పిస్తేనే.. అది శాశ్వత రాజధాని అవుతుందని పలువురు విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రధానంగా రాజధానికి కావాల్సింది.. శాశ్వత నిర్మాణాలని పేర్కొంటు న్నారు. గతంలో వైసీపీ అధినేత జగన్.. మూడు రాజధానుల పేరుతో కొత్త ప్రతిపాదనకు శ్రీకారం చుట్టడం వెనుక ఇదే కారణమని అంటున్నారు. అప్పట్లో తాత్కాలిక నిర్మాణాలు మాత్రమే చంద్రబాబు ప్రభుత్వం చేసింది. దీనిని చూపించిన జగన్.. అ న్నీ తాత్కాలికమేనని.. గ్రాఫిక్స్ అంటూ హేళన చేశారు. గత 2019-24 మధ్య ఒక్క ఇటుకను కూడా పేర్చలేదు. పైగా.. లక్ష కోట్ల రూపాయల ఖర్చును కూడా చూపించారు. దీంతో ఆయన మూడు రాజధానుల ప్రతి పాదనను తీసుకువచ్చి.. రాజధాని అమరావతిని ఎటూకాకుండా చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు అలా కాకూడదన్న సూచనలు వస్తున్నాయి. ప్రధాన, శాశ్వత నిర్మాణాలను సాధ్యమైనంత వేగంగా పూర్తి చేయాలన్నది సూచన. అదేవిధంగా వచ్చే భవిష్యత్తుకు సంబంధించి రాజధాని ఎలానూ సొంతగా నిధులు సమకూర్చుకునే ప్రయత్నం చేస్తుంది కాబట్టి.. దానికి సంబంధించిన ప్లాన్‌ను కూడా ఆవిష్కరిస్తే.. ఇక, రాజధానికి తిరుగు ఉండదన్న చర్చ నడుస్తోంది. అదేసమయంలో ప్రజాబాహుళ్యానికి సాధ్యమైనంత వేగంగా దీనిని అందుబాటులోకి తీసుకురావాలి. అంటే.. ప్రస్తుతం.. చెట్టుకొకటి .. పుట్టకొకటిగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వ శాఖల ప్రధాన కార్యాలయాలను అమరావతికి చేరేస్తే.. చాలని సూచిస్తున్నారు. ప్రస్తుతం విజయవాడలో కొన్ని.. మంగళగిరిలో కొన్ని గుంటూరులో మరికొన్ని.. హైదరాబాద్-విజయవాడ రూటులో ఇంకొన్ని ప్రభుత్వ ప్రధాన కార్యాలయాలు ఉన్నాయి. వాటిని అమరావతికి తక్షణం తరలించేస్తే.. ప్రజల రాకపోకలు పెరుగుతాయి. తద్వారా చిన్న చిన్న వ్యాపారాలు కూడా ప్రారంభం అవుతాయి. దీంతో ప్రజలకు వచ్చే ఎన్నికలకు ఏడాది ముందు.. అమరావతితో కార్యకలాపాలకు సంబంధించిన అనుబంధం పెరుగుతుంది. తద్వారా.. రేపు ఎవరు వచ్చినా.. అది ప్రజల సెంటిమెంటుతో ముడిపడి ఉంటుంది కాబట్టి కదలించేందుకు.. ప్రత్యేక తీర్మానాలు చేసేందుకు అవకాశం ఉండదని సూచిస్తున్నారు. ప్రభుత్వం తలుచుకుంటే ఇది పెద్ద విషయం కూడా కాదని అంటున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైం వాయిస్

## అబార్షన్‌కు ఒప్పుకోలేదని భర్త ఘాతుకం



**భార్య, ఇద్దరు కుమార్తెలను ఈతకొలనులోకి తోసి హత్య**

**భార్య, కుమార్తెలతో నిందితుడు అజారుద్దీన్**

**ఐనవోలు(వర్ధన్నపేట), విశ్వం వాయిస్ న్యూస్ :** అబార్షన్‌కు భార్య అంగీకరించలేదనే కోపం, మళ్లీ ఆడపిల్ల పుడుతుందనే అనుమానంతో ఆమెతోపాటు తన ఇద్దరు కుమార్తెలను ఈతకొలనులో తోసి హత్య చేసిన ఘటన హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం పున్నేలులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పున్నేలుకు చెందిన అజారుద్దీన్, ఫర్హాత్(26) దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉమేరా(8), ఆయేషా(6) ఉన్నారు. అజారుద్దీన్ గ్రామ శివారులో వరంగల్-ఖమ్మం జాతీయ రహదారి పక్కన ఈతకొలను నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇద్దరు ఆడపిల్లలు పుట్టిన అనంతరం ఫర్హాత్ రెండుసార్లు గర్భం దాల్చగా.. మళ్లీ ఆడపిల్లలు పుడతారనే అనుమానంతో అబార్షన్ చేయించాడు. నాలుగేళ్ల తర్వాత ఫర్హాత్ ఇటీవల తిరిగి గర్భం దాల్చారు. ఆడబిడ్డ పుడుతుందని అనుమానించిన అజారుద్దీన్.. అబార్షన్ చేయించుకోవాలని భార్యపై ఒత్తిడి తెచ్చాడు. ఆమె అంగీకరించకపోవడంతో పలుమార్లు గొడవపడ్డాడు. దీంతో కోపం పెంచుకున్న అతను పథకం ప్రకారం బుధవారం రాత్రి భార్య, పిల్లలను తమ ఈతకొలనుకు తీసుకెళ్లి ముగ్గురినీ నీటిలో తోసేసి హతమార్చాడు. వారు ప్రమాదవశాత్తు మరణించినట్లు అందరినీ నమ్మించేందుకు ప్రయత్నించాడు. అయితే ఫర్హాత్ తండ్రి అలీ.. అజారుద్దీన్‌పై అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించాడు. భార్య లేకపోతే పిల్లలను చూసే వారుండరని భావించి వారినీ చంపేసినట్లు చెప్పాడు. వరంగల్ సీపీ సన్‌ప్రీత్‌సింగ్, ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్‌లు గురువారం సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

## సినిమా ఛాన్స్ కోసం వచ్చి.. గుండెపోటుతో వ్యక్తి మృతి..

**విశ్వం వాయిస్ న్యూస్ :** సినిమాల్లో నటించాలన్న ఆశతో హైదరాబాద్‌కు వచ్చిన ఓ వ్యక్తి గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందాడు. అనకాపల్లికి చెందిన వడపల్లి సంజయ్ (55) ఇటీవల హైదరాబాద్‌కు వచ్చాడు. ఆడిషన్‌లో పాల్గొనాలని ఆరు రోజుల క్రితం బంజారాహిల్స్‌లోని ఓ సినిమా నిర్మాణ సంస్థ కార్యాలయానికి వెళ్లాడు. అప్పటికే ఎంపిక ప్రక్రియ పూర్తయిందని నిర్వాహకులు చెప్పడంతో వెనుదిరిగాడు. మళ్లీ బుధవారం అదే కార్యాలయానికి వెళ్లి తనకు అవకాశం ఇవ్వాలని కోరాడు. ప్రస్తుతం ఎలాంటి పాత్రలు లేవని నిర్వాహకులు చెప్పడంతో నిరాశతో కిందికి దిగాడు. అక్కడే కుర్చీలో కూర్చున్న సంజయ్.. కొన్ని సెకన్లలోనే కింద పడిపోయాడు. దీనికి సంబంధించిన దృశ్యాలు సీసీకెమెరాల్లో రికార్డు అయ్యాయి. సంజయ్ గుండెపోటుతో మరణించినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై బంజారాహిల్స్ పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## జల్సాల కోసం సొంత ఇంట్లోనే చోరీ

**కంచన్‌బాగ్, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్‌లోని కంచన్‌బాగ్‌లో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఇంట్లోని వ్యక్తే బంగారం చోరీ చేశాడని దర్యాప్తులో తేలింది. వివరాల్లోకి వెళ్తే.. మార్చి 29న ఎండీ షరీఫ్ అనే వ్యక్తి ఇంట్లో 20 తులాల బంగారం మాయమైంది. ఈ మేరకు మార్చి 31న పోలీసులకు ఫిర్యాదు అందింది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. ఇంట్లోని బంగారాన్ని షరీఫ్ కుమారుడు అద్నాన్ షరీఫ్ చోరీ చేశాడని గుర్తించారు. తన స్నేహితులతో కలిసి 4 సార్లు చోరీకి పాల్పడినట్లు తేల్చారు. జల్సాల కోసం కొంత బంగారాన్ని ఇప్పటికే అమ్మేసినట్లు గుర్తించారు. నిందితుల నుంచి 13 తులాల బంగారం, 4 సెల్‌ఫోన్లు, కారు స్వాధీనం చేసుకున్నారు.

## నేనూ నీ బిడ్డనే కదమ్మా

**కుమారుడి ఆరోగ్యం కోసం కుమార్తెను బలి ఇచ్చిన తల్లి - పోలీసుల అదుపులో నిందితులు**




**హజారీబాగ్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఝార్ఖండ్‌లోని హజారీబాగ్ జిల్లాలో కుమారుడి ఆరోగ్యం బాగుపడాలని ఓ తల్లి కన్నకూతుర్నే నరబలి ఇచ్చింది. విష్ణుగఢ్ పోలీస్ స్టేషను పరిధిలోని కుసుంబా గ్రామానికి చెందిన రేష్మీదేవి (35) కుమారుడు సుధీర్‌కుమార్ సింగ్ ఏడాది కాలంగా శారీరక, మానసిక అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నాడు. పరిష్కారం కోసం రేష్మీ గ్రామంలోని మంత్రగత్తె శాంతీదేవి(55)ని పలుమార్లు సంప్రదించింది. సుధీర్ ఆరోగ్యం శాశ్వతంగా బాగుపడాలంటే కన్య అయిన ఒక బాలికను బలి ఇవ్వాలని ఆమె సూచించింది. రేష్మీ చిన్నకుమార్తె (13)లో దైవశక్తి కొలువై ఉందని, ఆమెను బలి ఇవ్వడం శుభప్రదమైన కార్యమని నమ్మబలికింది. మార్చి 24న రాత్రి 9.30 గంటల సమయంలో రేష్మీ తన ప్రియుడైన భీమ్రామ్(40)తో కలిసి చిన్నకుమార్తెను శాంతి వద్దకు తీసుకెళ్లింది. తాంత్రిక క్రతువుల అనంతరం బాలికను భీమ్రామ్ చంపేశాడు. ఆమె రక్తంతో పూజలు చేశారు. మర్నాడు బాలిక మృతదేహాన్ని అనుమానాస్పద స్థితిలో గుర్తించిన పోలీసులు విచారణ ప్రారంభించి ఈ మిస్టరీ కేసును తాజాగా ఛేదించారు. రేష్మీ, భీమ్రామ్, శాంతీదేవిలను అరెస్టు చేశారు.

## ప్రేమపెళ్లి చేసుకున్న కుమార్తెను చంపిన తండ్రి

**తన పరువు తీసిందన్న కోపంతో ఘాతుకం**

**యువతి అనుమానాస్పద మృతి కేసులో వీడిన మిస్టరీ**



**నరసరావుపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** పల్నాడు జిల్లా మాచర్లకు చెందిన యువతి గత నెల 18న అనుమానాస్పదంగా మృతి చెందడం వెనకున్న మిస్టరీ వీడుతోంది. కన్నతండ్రే ఆమెను హత్య చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు తెలిసింది. మాచర్లకు చెందిన వ్యాపారి చంద్రశీను, గంగ దంపతులకు కుమార్తె చౌడేశ్వరి (22), కుమారుడు ఉన్నారు. వీరి పక్క ఇంటికి జమ్మలమడక గ్రామానికి చెందిన నాగరాజు తరచూ వచ్చేవాడు. ఈ క్రమంలో చౌడేశ్వరి, నాగరాజు ప్రేమించుకున్నారు. చంద్రశీను తన కుమార్తెను ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడికిచ్చి పెళ్లి చేయాలనుకున్నారు. రెండ్రోజుల్లో నిశ్చితార్థం ఉందనగా చౌడేశ్వరి ప్రేమించిన వ్యక్తితో వెళ్లిపోయి, పెళ్లి చేసుకున్నారు. కుమార్తె ప్రేమ వివాహాన్ని చంద్రశీను జీర్ణించుకోలేకపోయారు. తమ ఇంట్లోని బంగారు ఆభరణాలు పోయాయని, వాటిని తన కుమార్తె తీసుకెళ్లిందని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నాగరాజు, చౌడేశ్వరిని స్టేషన్‌కు తీసుకురాగా, తాను కట్టుబట్టలతో వెళ్లానని ఆమె చెప్పినా చంద్రశీను ఒప్పుకోలేదు. ఐదు రోజులు పుట్టింటికి వెళ్లి, తర్వాత భర్త వద్దకు వెళ్లేలా ఒప్పందం రాసుకున్నారు. మార్చి 19న ఆమె తన భర్త ఇంటికి వెళ్లాల్సి ఉండగా, 18న అనుమానాస్పదంగా మృతి చెందింది. పోస్టుమార్టం నివేదికలో చౌడేశ్వరిది ఆత్మహత్య కాదని నిర్ధారణైంది. పోలీసులు ఆమె తండ్రిని విచారించగా.. అసలు విషయం వెలుగు చూసింది. మార్చి 18న తన కుమార్తెను హతమార్చాలని చంద్రశీను పథకం వేశారు. భార్య, కుమారుడిని పొలానికి పంపారు. మేనల్లుడు పచ్చిపాల శీనుతో కలిసి ఇంట్లో నిద్రిస్తున్న యువతి ముఖంపై దిండు అదిమిపెట్టి చంపేశారు. తర్వాత ఉరేసుకున్నట్లు చిత్రీకరించారు. 'ఆస్తిపరుడికి ఇచ్చి కుమార్తె వివాహాన్ని ఘనంగా చేయాలనుకున్నా. ప్రేమ పెళ్లి చేసుకొని నా పరువు తీసిందన్న కోపంతో చంపాను' అని నిందితుడు పోలీసుల ఎదుట నేరాన్ని అంగీకరించినట్లు తెలిసింది. జిల్లా అదనపు ఎస్పీ సంతోష్ నిందితులను విచారిస్తున్నారు.

## కన్న కూతుళ్లను బావిలో తోసి కడతేర్చిన తండ్రి

**కరీంనగర్ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కరీంనగర్ రూరల్ మండలం జూబ్లీనగర్‌లో దారుణం చోటు చేసుకుంది. కన్న కూతుళ్లను అల్లారుముద్దుగా చూసుకోవాల్సిన తండ్రి.. కర్కశుడిగా మారాడు. తన ఇద్దరు కవల పిల్లల్ని బావిలో తోసేసి హతమార్చాడు. తొలుత వారిని బావిలోకి నెట్టేసిన శ్రీశైలం.. తానూ దూకేశాడు. అయితే, ఈత రావడంతో సురక్షితంగా బయటకు వచ్చేశాడు. సమాచారం అందుకున్న స్థానికులు బావిలో వెతకగా.. ఒక బాలిక మృతదేహం లభ్యమైంది. మరో మృతదేహం కోసం గాలిస్తున్నారు. ఆగ్రహించిన గ్రామస్థులు తండ్రికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ కలహాలే ఈ ఘటనకు కారణమని ప్రాథమికంగా నిర్ధరించారు.

## అనకాపల్లి జిల్లాలో రోడ్డు ప్రమాదం.. ముగ్గురి మృతి



**ఎలమంచిలి, విశ్వం వాయిస్ న్యూస్ :** అనకాపల్లి జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ముగ్గురు యువకులు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎలమంచిలి మండలం పోతిరెడ్డిపాలెం కూడలి వద్ద జాతీయ రహదారిపై బైక్‌ను ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. గురువారం అర్ధరాత్రి దాటిన ఈ ఘటన చోటుచేసుకుంది. మృతులను పురుషోత్తపురం గ్రామానికి చెందిన బంగారు నాని (24), ఏటికొప్పాకకు చెందిన ఇల్లకు గోవిందు (25), పోతిరెడ్డిపాలేనికి చెందిన బంగారు దుర్గాప్రసాద్(16)గా గుర్తించారు. పెయింటర్లుగా ఉపాధి పొందుతున్న ఈ ముగ్గురూ.. పురుషోత్తపురంలోని అమ్మవారి జాతర చూసేందుకు రాత్రి 10 గంటల సమయంలో వెళ్లారు. తిరిగి వస్తూ దుర్గాప్రసాద్‌ను పోతిరెడ్డిపాలెంలో దించేందుకు బైక్‌పై వెళ్లారు. ఈ క్రమంలో గ్రామ కూడలి వద్ద వీరి బైక్‌ను విజయవాడ వైపు వెళ్తున్న బస్సు ఢీకొట్టింది. ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా.. మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. ఎలమంచిలి సీఐ ధనుంజయరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# బిజినెస్ వాయిస్

రుణం తీసుకున్న వ్యక్తి ఎగ్గొడితే..

## హామీదారుడు కట్టాల్సిందేనా..?




రుణం తీసుకున్న వ్యక్తి ఎగ్గొట్టినప్పుడు హామీదారుడు కట్టాల్సిందేనా.. ? అవును అంటున్నాయి బ్యాంకింగ్ నిబంధనలు. పెద్ద మొత్తంలో రుణం మంజూరు చేసే సమయంలో బ్యాంకులు ష్యూరిటీ సతకం చేపించుకుంటాయి. ఆ తర్వాతనే లోన్ మంజూరు చేస్తాయి. హామీదారుడులపై బ్యాంకులకు చట్టబద్దంగా హక్కులు ఉంటాయి. బ్యాంకులు కొన్ని రకాల రుణాలు మంజూరు చేసే సమయంలో ఇతర వ్యక్తుల ష్యూరిటీ కోరుతుంది. ఒకరు లేదా ఇద్దరు వ్యక్తుల హామీ కోరతాయి. హామీలు సమర్పిస్తేనే రుణాలు మంజూరు చేస్తాయి. హోమ్ లోన్, బిజినెస్ లోన్ లోన్లకు హామీ సంతకాలు, వారి ధృవీకరణ పత్రాల జిరాక్స్ కాపీలను కోరుతున్నాయి. పర్సనల్ లోన్ లాంటి కొన్ని రుణాలకు ఇతర వ్యక్తుల ష్యూరిటీని కోరడం లేదు. కానీ ప్రస్తుతం పెద్ద పెద్ద రుణాలకు హామీదారులను కోరుతున్నాయి. ఇలాంటి సమయంలో రుణం తీసుకున్న వ్యక్తి చెల్లించకపోతే హామీదారుడు చెల్లించాల్సి ఉంటుంది..? హామీదారుడి సిబిల్ స్కోర్ కూడా ప్రభావితం అవుతుందా..? హామీదారుడికి ఎలాంటి నష్టాలు ఉంటాయి..? ఇలాంటి సమయంలో హామీదారుడి ఆస్తులను కూడా జప్తు చేస్తారా? బ్యాంకింగ్ నిబంధనలు ఏం చెబుతున్నాయి..? లాంటి అనేక ప్రశ్నలకు సమాధానాలు ఇందులో చూద్దాం. లోన్ డీఫాల్ట్ అయినప్పుడు బ్యాంక్ రుణగ్రహీతతో పాటు హామీదారుడి డీటైల్స్‌ను కూడా సిబిల్‌కు పంపుతుంది. దీని వల్ల హామీదారుడి సిబిల్ స్కోర్‌పై కూడా ప్రభావితం చూపుతుంది. ఇలాంటి సమయంలో హామీదారుడు ఏ బ్యాంకుల్లో లోన్ తీసుకోవడానికి కుదరదు. ఇక రుణగ్రహీత ఆస్తులను జప్తు చేయలేని పక్షంలో హామీదారుడి ఆస్తులను అయినా జప్తు చేసే అధికారం బ్యాంకులకు ఉంటుంది. లేదా హామీదారుడి నుంచి డబ్బుని తిరిగి రాబట్టవచ్చు. ఇక హామీదారుడిని కూడా డీఫాల్ట్ అయినట్లు ప్రకటిస్తారు. దీంతో మీరు ఏ వ్యక్తి బ్యాంక్ రుణానికి అయినా హామీదారుడిగా సంతకం చేస్తుంటే ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోండి. సదరు వ్యక్తికి సంబంధించి ఆర్థిక పరిస్థితిని తెలుసుకోండి. గతంలో తీసుకున్న రుణాలను సరిగ్గా చెల్లించారా.. లేదా అనే విషయాలను తెలుసుకోండి. అవన్నీ తెలుసుకున్న తర్వాతనే గ్యారంటీయర్‌గా సంతకం చేయండి. తెలియని వ్యక్తులను అసలు చేయవద్దు. ఒక వ్యక్తి రుణం తీసుకునే సమయంలో దరఖాస్తుపై హామీదారుడు సంతకం చేస్తాడు. దీంతో బ్యాంక్, హామీదారుడి మధ్య ఒప్పందం జరిగినట్లు లెక్క. లోన్ తీసుకున్న వ్యక్తి తిరిగి చెల్లించని పక్షంలో హామీదారుడి నుంచి వడ్డీతో సహా వసూలు చేసే హక్కు బ్యాంకులకు చట్టబద్దంగా ఉంటుంది. బ్యాంకింగ్ రూల్స్ కూడా ఇందుకు అనుకూలంగా ఉన్నాయి.

## ఓటీపీ లేకుండానే బ్యాంక్ చెల్లింపులు..

### సైలెంట్ అథెంటిఫికేషన్ ఫీచర్ వచ్చేస్తుంది.. ఎలా పనిచేస్తుందంటే..?

బ్యాంక్ లావాదేవీలకు రెండెంచల వెరిఫికేషన్ విధానాన్ని తప్పనిసరి చేస్తూ ఆర్బీఐ నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ 1 నుంచి దీనిని అమలు చేస్తోంది. ఈ క్రమంలో సైలెంట్ అథెంటిఫికేషన్ ఫీచర్‌పై బ్యాంకులు వర్క్ చేస్తున్నాయి. అంటే ఓటీపీ అవసరం లేకుండానే చెల్లింపులు చేసేలా కొత్త మెకానిజం తీసుకురానున్నారు. సైబర్ నేరాలు పెరుగుతున్న క్రమంలో బ్యాంకులు, టెలికాం కంపెనీలు వినియోగదారుల భద్రత కోసం సరికొత్త నిర్ణయం తీసుకున్నాయి. బ్యాంక్ అకౌంట్లలోని డబ్బులను చోరీ చేస్తున్న క్రమంలో దీనిని నివారించే చర్యలు చేపట్టాయి. అందులో భాగంగా సైలెంట్ అథెంటిఫికేషన్ ఫీచర్‌పై పనిచేస్తున్నాయి. ఓటీపీ అవసరం లేకుండానే బ్యాంక్ లావాదేవీలు చేసేలా కొత్త వ్యవస్థను తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. సిమ్ క్లోనింగ్, ఈ-సిమ్ మోసాలను అరికట్టడానికి ఈ కొత్త మెకానిజం ఉపయోగపడనుంది. సైలెంట్ అథెంటిఫికేషన్ అంటే ఒకరకంగా బ్యాక్‌గ్రౌండ్ చెక్ అని అర్థం. అంటే మీ బ్యాంక్ యాప్‌తో లింక్ అయిన మొబైల్ నెంబర్, మీ ఫోన్‌లోని సిమ్ కార్డు నెంబర్ రెండూ ఒక్కటేనా అనేది వెరిఫై చేస్తుంది. ఒకవేళ రెండూ ఒకేలా లేకపోతే సదరు బ్యాంక్ ట్రాన్సాక్షన్ అనుమానాస్పదంగా గుర్తిస్తుంది. ఆ లావాదేవీ జరగకుండా ఆటోమేటిక్‌గా నిరోధిస్తుంది. ఈ-సిమ్‌లపై కూడా ఈ టెక్నాలజీ పనిచేస్తుంది. మోసగాళ్లు తరచుగా ఓటీపీలను దొంగలించి సిమ్ క్లోనింగ్, ఈ-సిమ్ స్వైపింగ్ ద్వారా మోసాలకు పాల్పడుతున్న క్రమంలో అదనపు భద్రతగా సైలెంట్ అథెంటిఫికేషన్ ఫీచర్ అనేది సహాయపడుతుంది. మీ బ్యాంక్ అకౌంట్‌తో లింక్ అయిన సిమ్ కార్డు నెంబర్ మీ ఫోన్‌లో ఉందో.. లేదో చెక్ చేస్తుంది. ఇక ఈ-సిమ్ ద్వారా జరిగే మోసాలను అరికడుతుంది. బ్యాంక్ అకౌంట్‌కు లింక్ అయిన మొబైల్ నెంబర్, ఫోన్‌లోని సిమ్ కార్డు నెంబర్ ఒక్కటేనా అనేది బ్యాక్‌గ్రౌండ్‌లో ఆటోమేటిక్‌గా చెకింగ్ జరుగుతుంది. దీని వల్ల బ్యాంక్ ఓటీపీల పని ఉండదు. సైబర్ నేరగాళ్ల ఓటీపీల ద్వారా చేసే మోసాలకు ఫుల్ స్టాఫ్ పడుతుంది. ప్రస్తుతం టెలికాం కంపెనీలతో ట్రయల్స్ జరుగుతున్నాయి. రాబోయే రోజుల్లో ఈ మార్పు బ్యాంకింగ్ రంగంలో రానుంది. మరోవైపు బ్యాంకులు ఫోన్‌కు ఎస్ఎంఎస్‌ల ద్వారా ఓటీపీలు కాకుండా తమ సొంత యాప్‌ల ద్వారా పంపించే విషయాన్ని పరిశీలిస్తున్నాయి. అన్ని డిజిటల్ లావాదేవీలకు రెండు అంచెల భద్రతను ఏప్రిల్ 1 నుంచి ఆర్బీఐ తప్పనిసరి చేసింది. ఈ క్రమంలో సైలెంట్ మెకానిజంపై బ్యాంకులు వర్క్ చేస్తున్నాయి. ఇది అందుబాటులోకి వస్తే ఓటీపీల వ్యవస్థకు చెక్ పడనుంది.



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...






# అనధికార పాల విక్రయాలపై కఠిన చర్యలు

**ఎఫ్ఎస్ఎస్ఎఐలో నమోదు తప్పనిసరి - లైసెన్స్ లేకుండా పాల విక్రయాలు చేస్తే రూ.5 లక్షల వరకు జరిమానా**

**జిల్లాలో పాల నాణ్యతపై కట్టుదిట్టమైన పర్యవేక్షణ - విక్రేతలు వెంటనే నమోదు కావాలి**

**పశు సంవర్ధక శాఖ - ఫుడ్ సేఫ్టీ అధికారులతో సంయుక్త బృందం ఏర్పాటు : కలెక్టర్ కీర్తి చేకూరి**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలో అనధికారికంగా పాల విక్రయాలు నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. కల్తీ పాలు ఘటనల నేపథ్యంలో జిల్లాలోని అన్ని స్థాయిల పాల ఉత్పత్తి దారులు,విక్రేతలు తప్పనిసరిగా ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ ఎస్ ఏ ఐ) వద్ద నమోదు చేసుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు జిల్లా పశు సంవర్ధక అధికారి డా. టి. శ్రీనివాసరావు (డి ఏ హెచ్ ఓ), జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి డా. కె. సుప్రియ లకు తగిన చర్యలు తీసుకోవాలని శుక్రవారం ఆదేశించడం జరిగింది. జిల్లాలో పాలు, పాల ఉత్పత్తులు మరియు మాంసాహార పదార్థాల నాణ్యతపై పర్యవేక్షణను కట్టుదిట్టం చేయడానికి పశు సంవర్ధక శాఖ మరియు ఫుడ్ సేఫ్టీ అధికారులతో సంయుక్త బృందాన్ని ఏర్పాటు చేయడం జరిగినట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 651 మంది పాల విక్రేతలు ఎఫ్ ఎస్ ఏ ఐ లైసెన్స్ లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించామని అధికారులు తెలిపారు. అదే విధంగా సుమారు 650 మంది ఇంటింటికి పాలు సరఫరా చేసే వ్యక్తులు, మరో



725 మంది అనధికారిక పాల విక్రేతలు, షాపు యజమానులు, పాల సహకార సంఘాలు లైసెన్స్ లేకుండా పాల సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో పాల నాణ్యతను కాపాడడం కోసం ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాల సరఫరా కోసం లైసెన్స్ పొందాలని సూచించారు. ఎఫ్ఎస్ఎస్ఎఐ లైసెన్స్ లేకుండా పాల విక్రయాలు నిర్వహిస్తున్న వారిపై రూ. 5 లక్షల వరకు జరిమానా విధించబడుతుందని హెచ్చరించారు. చట్ట విరుద్ధంగా కార్యకలాపాలు కొనసాగిస్తే మరింత కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పాల విక్రయాలు చేసే వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వారి వివరాలు ఎఫ్ ఎస్ ఎస్ ఏ ఐ వెబ్ సైట్ లో పేర్లు నమోదు చేసుకోవాలని అధికారులు కోరారు. క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించే పశుసంవర్ధక సహాయకులు తమ పరిధిలో ఉన్న పాల విక్రేతలను గుర్తించి, వారికి అవగాహన కల్పిస్తూ తప్పనిసరిగా పేర్లు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా పశు సంవర్ధక అధికారి టి శ్రీనివాస రావు తెలియ చేశారు. పాల విక్రేతలు ఎఫ్ ఎస్ ఎస్ ఏ ఐ నమోదు కోసం అధికారిక వెబ్‌సైట్ https://foscos.fssai.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, అలాగే సమీప వెటర్నరీ ఆసుపత్రి లేదా పశుసంవర్ధక సహాయకులను సంప్రదించి కూడా నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి కె సుప్రియ సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకోకుండా కార్యకలాపాలు నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# పంచాయతీ పాలకవర్గాలకు ఘనంగా వీడ్కోలు సభలు




**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని పలు గ్రామాల్లో పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో గురువారం అధికారులు, గ్రామ పెద్దల సమక్షంలో ఘనంగా వీడ్కోలు సభలు నిర్వహించారు. గ్రామాభివృద్ధికి సేవలందించిన సర్పంచులు, వార్డ్ మెంబర్స్‌కు ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.

**రాయవరంలో సర్పంచ్‌కు ఘన సన్మానం**

మండల కేంద్రమైన రాయవరంలో యువ చైతన్య యూత్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ చంద్రమళ్ళ రామకృష్ణకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆయన గ్రామ పంచాయతీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కార్యక్రమం లో పాల్గొన్న గ్రామ పెద్దలు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని పలువురు ప్రముఖులు పాల్గొని రామకృష్ణ సేవలను కొనియాడుతూ, ఆయన చేసిన అభివృద్ధి కార్యక్రమాలను గుర్తుచేశారు.

**నదురుబాద గ్రామంలో సన్మానం**

నదురుబాద గ్రామంలో సర్పంచ్ చింతపల్లి శ్రీనివాసరావు, వార్డ్ సభ్యులు ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ, ఐకేపీ సిబ్బంది కలిసి సర్పంచ్ వార్డ్ మెంబర్స్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మిర్తిపాటి



సత్యనారాయణ, పంచాయతీ సెక్రటరీ వాసంశెట్టి జనార్దన్ రావు, వార్డ్ మెంబర్స్ దొంగలు బంగారయ్య, మిర్తిపాడు జ్యోతి తదితరులు పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధికి వారు చేసిన సేవలను గ్రామస్తులు కొనియాడారు. మొత్తంగా పంచాయతీ పాలకవర్గాల సేవలను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ వీడ్కోలు సభలు గ్రామాల్లో భావోద్వేగ వాతావరణాన్ని సృష్టించాయి.

# యేసుక్రీస్తు త్యాగాన్ని స్మరించుకుంటూ ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు

**యేసు క్రీస్తు మరణ ఘట్టం ప్రదర్శిస్తూ ప్రత్యేక ర్యాలీ, ప్రార్థనలు నిర్వహించిన విశ్వాసులు**

**అనపర్తి, విశ్వం వాయిస్ న్యూస్ :** క్రైస్తవ లోకానికి అత్యంత పవిత్రమైన పర్వదినమైన గుడ్ ఫ్రైడే సందర్భంగా నియోజకవర్గ కేంద్రమైన అనపర్తి ప్రాంతంలో భక్తి శ్రద్ధలతో వేడుకలు ఘనంగా నిర్వహించారు. యేసుక్రీస్తు మానవాళి పాపాల విమోచన కోసం చేసిన మహా త్యాగాన్ని స్మరించుకుంటూ విశ్వాసులు ప్రార్థనల్లో నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగా అనపర్తిలోని కథోలిక దేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా రాయవరం, కొంకుదురు, అనపర్తి, వెదురుపాక గ్రామాల నుండి అధిక సంఖ్యలో క్రైస్తవ విశ్వాసులు తరలివచ్చి భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక ర్యాలీ నిర్వహించి యేసుక్రీస్తు శిలువ



వేయబడిన సందర్భాలను ప్రతిబింబించే సన్నివేశాలను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలు విశ్వాసులలో ఆత్మపరిశీలనను కలిగించాయి. ఈ కార్యక్రమంలో ఉపదేశకులు లంక రాజు, మచ్చా లాజర్ లు మాట్లాడుతూ, యేసుక్రీస్తు ప్రేమ, క్షమ, త్యాగం అనే విలువలను మానవాళికి చూపించిన గొప్ప మార్గదర్శి అని కొనియాడారు. ఆయన తన ప్రాణాలను అర్పించడం ద్వారా మనుషులకు ప్రేమ, సేవ, సహనానికి ఉన్న ప్రాముఖ్యతను తెలియజేశారని పేర్కొన్నారు. ఈ గుడ్ ఫ్రైడే వేడుకలు విశ్వాసులకు ఆధ్యాత్మిక చైతన్యాన్ని నింపుతూ, యేసుక్రీస్తు త్యాగాన్ని మరొక్కసారి స్మరించుకునేలా గుర్తుచేశాయి.

# అక్రమంగా అడ్మిషన్లు ఇస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు చేపట్టాలి

**- అడ్మిషన్లు ప్రారంభమంటూ నగరంలో ప్రచార ఫ్లెక్సీలను తొలగించాలి**


**- పుట్టగొడుగుల పుడుతున్న ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు - రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ డిమాండ్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా అక్రమంగా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పి.డి.ఎస్.యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం పిడిఎస్యూ జిల్లా కార్యాలయంలో ఉన్న ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్త ఉన్న కార్పొరేట్ విద్యా సంస్థలైన మరియు కొన్ని ప్రైవేటు విద్యా సంస్థలు 2026 -27 విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ముందస్తు అడ్మిషన్లు ప్రారంభించారని అన్నారు. కార్పొరేట్ సంస్థల వారు బహిరంగంగా కరపత్రాలు, ఫ్లెక్సీలు వేసి అడ్మిషన్ల కొరకు ఎలక్షన్ ప్రచారం రీతిలో కార్పొరేట్ విద్యా సంస్థలు ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ది ఢిల్లీ పబ్లిక్ స్కూల్, దిక్రీడో ఇంటర్నేషనల్ ఒలంపియాడ్ ,ఇంటర్నేషనల్ స్కూల్, అని ప్రచారం నిర్వహిస్తూ ఐఐటి ట్రిబుల్ ఐటీ ఫౌండేషన్ లాంటి కోర్సులు ఎల్కేజీ నుండే ప్రారంభిస్తున్నామని తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి ప్రజలను దోచుకుంటున్నారని విమర్శించారు. ఆర్థికమే ధ్యేయంగా పుట్టగొడుగుల పుట్టుకొస్తున్నటువంటి ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు రాష్ట్ర వ్యాప్తంగా సరైనటువంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం వహించి,చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. కార్పొరేట్ ప్రైవేట్ విద్యా సంస్థ యాజమాన్యాలు ముందస్తు అడ్మిషన్ల పేర్లతో పిఆర్ఓ లను , ఉపాధ్యాయులను ఏర్పాటు చేసి ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని , తల్లిదండ్రులు అవగాహన సదస్సులు,స్కాలర్ షిప్ టెస్ట్ లు పేరుతో, విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ పేరుతో ఒక్కో స్టూడెంట్ నుండి మినిమం 500-1000 రూపాయలు స్కానర్స్ ద్వారా తీసుకోవడమే జరుగుతుందని , దసరా ,శ్రీరామనవమి , సంక్రాంతి పండుగ సందర్భంగా విద్యార్థులు జాయిన్ అయితే మంచి జరుగుతుందనే ప్రచారంతో విద్యార్థులను అడ్వాన్స్ బుకింగ్ పేరుతో ఫీజులు కట్టించుకుంటున్నారని తెలిపారు. కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యా సంవత్సరం ఇంకా ప్రారంభం కాకముందే ముందస్తు అక్రమ అడ్మిషన్ ఫీజులతో పాటు,స్పెషల్ ఫీజు,పుస్తకాల ఫీజులని విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. ఒక్క సంస్థకి పర్మిషన్ తీసుకుని సబ్ బ్రాంచ్ ల పేరుతో నూతన భవనాలు నిర్మించడం సరికాదన్నారు. తక్షణమే రాష్ట్ర వ్యాప్తంగా అక్రమంగా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న పాఠశాలలపై విచారణ జరిపి అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు జిల్లా కార్యదర్శి కె.భాను ప్రసాద్ జిల్లా నాయకులు చంద్రశేఖర్, మహారెడ్డి, దినేష్ కుమార్, రోహిత్, శ్రీను, శివారెడ్డి, మార్క్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**అమరావతి శాశ్వత రాజధాని నిర్ణయానికి**

# రాయవరంలో వేడుకలు



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమీకరణ కార్యక్రమంలో భాగంగా, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోరిక మేరకు అమరావతిని రాష్ట్ర శాశ్వత రాజధానిగా గుర్తిస్తూ పార్లమెంట్ చట్టబద్ధమైన ఆమోదం తెలిపిన సందర్భంగా రాయవరం మండలంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ చారిత్రాత్మక ఘట్టాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి అమరావతిలో గురువారం రాత్రి 7 గంటలకు 'అమర జ్యోతి/అఖండ జ్యోతి'ని వెలిగించారు. దీనికి అనుసంధానంగా రాయవరం మండలం, వి.సావరం గ్రామంలోని స్వర్ణ సచివాలయం వద్ద ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు, గ్రామ ప్రజలు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, ఇతర గ్రామస్థాయి సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానికులు దీపాలు వెలిగించి తమ మద్దతును తెలియజేశారు. అమరావతి శాశ్వత రాజధాని నిర్ణయం రాష్ట్ర అభివృద్ధికి కీలకమని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. వేడుకల సందర్భంగా గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది.

# బీసీలకు తక్షణమే రక్షణ చట్టం అమలు చేయాలి

**బీసీవై పార్టీ నేతల డిమాండ్**



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

రాష్ట్రంలో బీసీల హక్కుల పరి రక్షణ కోసం ప్రత్యేక రక్షణ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని బీసీవై పార్టీ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అమలాపురంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మట్టా వీరబాబు గౌడ్ మాట్లాడుతూ, రాష్ట్ర అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో విజయవాడలో భారీ సమావేశం నిర్వహించామని తెలిపారు. ఆ సమావేశంలో ఐదు ప్రధాన డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. బీసీ రక్షణ చట్టం అమలు చేయడం, రాజధాని ప్రాంతంలో బీసీలకు 1000 ఎకరాల భూమి కేటాయించడం, బీసీ కులాల కార్పొరేషన్లకు తగిన నిధులు విడుదల చేయడం, సమగ్ర కుల గణన చేపట్టడం, విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థలు, చట్టసభల్లో 44 శాతం రిజర్వేషన్ కల్పించడం వంటి డిమాండ్లపై ప్రభుత్వం ఏప్రిల్ 10లోపు స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. అలా చేయని పక్షంలో ఏప్రిల్ 11న విజయవాడలో బీసీవై పార్టీ ఆధ్వర్యంలో ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. ఇటీవల బీసీ నాయకుడు మట్టపర్తి సూర్య చంద్రరావుపై జరిగిన దాడులను తీవ్రంగా ఖండిస్తూ, బీసీ కులాలపై జరుగుతున్న అన్యాయాలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం మాదిరిగా బీసీలకు కూడా రక్షణ కల్పించే ప్రత్యేక చట్టాన్ని వెంటనే తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు సంసాని రామకృష్ణ, కాంద్రేగుల నరసింహం, దొమ్మేటి వెంకటరావు, దూనబోయిన పల్లంరాజు, బొక్కా సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందుపల్లి సర్పంచ్ చొల్లంగి శివాలనీ అప్పాజీకి ఘన సన్మానం

**అభివృద్ధి దిశగా ముందుకు నడిపిన నాయకత్వానికి ప్రశంసలు**

**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**





అమలాపురం రూరల్ మండలం ఇందుపల్లి గ్రామంలో సేవాభావంతో, అభివృద్ధి దృక్పథంతో ఐదేళ్ల పాటు సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించిన చొల్లంగి శివాలనీ అప్పాజీ కి గ్రామస్థులు ఘనంగా సన్మానం చేశారు. పదవీకాలం ముగిసిన సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ సన్మాన కార్యక్రమంలో గ్రామ ప్రెసిడెంట్ (పాలకవర్గ అధ్యక్షుడు) ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సర్పంచ్ సేవలను కొనియాడుతూ, గ్రామ అభివృద్ధిలో ఆయన చూపిన కట్టుబాటు, పారదర్శకత, ప్రజలతో కలిసిమెలిసి పనిచేసే ధోరణి ఆదర్శప్రాయమని ప్రెసిడెంట్ ప్రశంసించారు. సర్పంచ్ చొల్లంగి శివాలనీ అప్పాజీ మాట్లాడుతూ తన పదవీకాలంలో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు అందరూ అందించిన సహకారం మరువలేనిదని తెలిపారు. మొదటి రోజు నుంచి గ్రామాభివృద్ధినే లక్ష్యంగా పెట్టుకుని పనిచేశానని, గ్రామస్తుల విశ్వాసం తనకు బలంగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు, పెద్దలకు, పాలకవర్గ సభ్యులకు, సచివాలయం సిబ్బందికి ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పాలకవర్గ సభ్యులు, యువకులు, మహిళలు, సచివాలయం సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొని సర్పంచ్ గారికి శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. గ్రామ అభివృద్ధికి కృషి చేసిన నాయకుడికి ఈ సన్మానం ఒక గుర్తింపుగా నిలిచింది.

# హిందువుల్లారా త్వరగా మేల్కోకపోతే భవిష్యత్ అంధకారమే : కంబాల

**వడ్డీల రామాలయానికి ఐదు లక్షలు విరాళం - లవ్ జిహాద్, భూ జిహాద్ ఉచ్చులో పడకండి**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** మన హిందువులందరికీ పెను ప్రమాదం ఇతర రాష్ట్రాలలోనే కాకుండా మన రాష్ట్రంలోకి ప్రవేశించిందని హిందూ బంధువులంతా సంఘటితమై తరిమికొట్టవలసిన బాధ్యత మనందరిపై ఉందని హిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు బిజెపి నాయకులు కంబాల శ్రీనివాసరావు హిందువులకు పిలుపునిచ్చారు. శుక్రవారం కోరుకొండ వడ్డీల రామాలయం పునఃనిర్మాణా, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి కంబాల ముఖ్యఅతిథిగా విచ్చేసి సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కంబాలకు తీన్మార్ డప్పులతో మహిళలు హారతులు ఇస్తూ, జైశ్రీరామ్ కంబాల జై జై అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం కంబాల మాట్లాడుతూ పాకిస్తాన్, వెస్ట్ బెంగాల్ రాష్ట్రాల్లో హిందువులను అనేక చిత్రహింసలు పెడుతున్న దృశ్యాలు మన హిందువులందరకు ఒళ్ళు జలదరిస్తుందన్నారు. మన రాష్ట్రంలోనే హిందువుల పిల్లలను లవ్ జిహాద్ పేరుతో వివాహం చేసుకొని, అనంతరం పెడుతున్న చిత్రహింసలు వర్ణాతీతమన్నారు. పోలవరం జిల్లాలో ఎస్టీలను భూ జిహాద్ పేరుతో వివాహాలు చేసుకుని, వారి భూములను ఆక్రమిస్తున్నారన్నారు. ఇటీవల మన ఉప శాసనసభాపతి రఘురామకృష్ణంరాజు సీతారాములకు పూలదండ వేయడానికి వెళితే, మేకలతో దాడి చేసిన దృశ్యాలు కంటతడి తెప్పించాయన్నారు. హిందువుల పిల్లలందరూ జిహాదుల ముసుగులో పడకుండ అప్రమత్తమై, రుద్రమదేవి, ఝాన్సీ లక్ష్మీబాయి వంటి వీరవనితలు యువతులకు ఆదర్శం కావాలన్నారు. రాజానగరం, జగ్గంపేట, పోలవరం నియోజకవర్గాల్లో ఎటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అనారోగ్య, ఆర్థిక ఇబ్బందులు కలిగిన ఆదుకోవడానికి కంభాల ముందు ఉంటారన్నారు.కోరుకొండ వడ్డీల రామాయణం పునః నిర్మాణానికి, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలకు 5 లక్షల రూపాయల విరాళాన్ని అందించాసన్నారు. ప్రతి దేవాలయానికి, అన్న వితరణ కార్యక్రమాలకు కంబాల కొండంతండగా ఉంటాడన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కంబాలకు పూల మాలలు వేసి సాల్వతో ఘనంగా సత్కరిస్తూ, జ్ఞాపికను అందజేశారు. అనంతరం రామసేన సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీసభ్యులు సైదు శ్రీను, దోమ వెంకటరమణ, కొవ్వూరి వీరబాబు, మల్లి వెంకటరమణ, కొవ్వూరి అప్పారావు, రామసేన సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.







# లొల్లలాకుల పునరుద్ధరణకు రూ.74.20 కోట్లు

**ఐదు నియోజకవర్గాల రైతులకు వరం : ఎమ్మెల్యే బండారు - ఎమ్మెల్యే బండారు అభినందించిన మంత్రి వాసంశెట్టి సుభాష్**

**కోనసీమ భగీరథుడు ఎమ్మెల్యే బండారు అంటూ నినాదాతో హోరెత్తిన రావులపాలెం**



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** రావులపాలెం: డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ఐదు నియోజకవర్గాల రైతులకు లొల్లలాకుల పునరుద్ధరణకు రూ.74 కోట్ల 20 లక్షల నిధులు మంజూరు కావడం శుభపరిణామమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. రావులపాలెం క్యాంప్ కార్యాలయానికి చేరుకున్న ఆయనకు స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యేను భుజాలపై మోసుకుంటూ "కోనసీమ భగీరథుడు బండారు" అంటూ నినాదాలతో హోరెత్తించారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ క్యాంప్ కార్యాలయానికి చేరుకుని ఎమ్మెల్యే బండారును అభినందించారు. అనంతరం స్థానిక జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ ఎమ్మెల్యేకు స్వాగతం పలికి సత్కరించి అభినందనలు తెలిపారు. ఇదే సమయంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ కూడా ఎమ్మెల్యే బండారును సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ లొల్లలాకుల ప్రాజెక్ట్ ఐదు నియోజకవర్గాల పరిధిలోని రైతులకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఈ ప్రాజెక్ట్ సాధనలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఎల్లలేని కృషి చేశారని ప్రశంసిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో గత 20 నెలలుగా అభివృద్ధి కార్యక్రమాలు సజావుగా కొనసాగుతున్నాయని, రాబోయే రోజుల్లో ఎన్డీఏ కూటమి నాయకత్వంలో మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టనున్నామని తెలిపారు. ఇటీవల పార్లమెంటు రాజ్యసభలో అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాజధానిగా ఆమోదించడం జరిగిందని, దీనిని ఓర్వలేక మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే బండారు చేపడుతున్న అభివృద్ధి పనులను మంత్రి కొనియాడారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ, లొల్లలాకుల పునరుద్ధరణకు నిధులు విడుదల చేయడంలో సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొండల పవన్ కళ్యాణ్, ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చం నాయుడు, జిల్లా మంత్రి వాసంశెట్టి సుభాష్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గతంలో నారా చంద్రబాబు నాయుడు రావులపాలెం పర్యటనకు వచ్చిన సమయంలో లొల్లలాకుల సమస్యను తన దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఆ సమయంలోనే ఈ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అదేవిధంగా యువగళం పాదయాత్ర సందర్భంగా కొత్తపేట నియోజకవర్గంలోని సమస్యలను వివరించే సందర్భంలో ఆత్రేయపురం మండలంలోని లొల్లలాకుల పునరుద్ధరణ అవసరాన్ని ప్రస్తావించినట్లు తెలిపారు. అయితే కొన్ని కారణాల వల్ల పాదయాత్రలో మైలురాయి ఏర్పాటు చేయలేకపోయామని చెప్పారు. అలాగే ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు కూడా లొల్లలాకుల పునరుద్ధరణకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. లొల్లలాకుల పునరుద్ధరణ వల్ల జిల్లాలోని ఐదు నియోజకవర్గాల రైతుల సమస్యలు పరిష్కారం అవుతాయని, అదేవిధంగా అమలాపురం-బొబ్బర్లంక హైవేకు కూడా ఉపయోగం కలుగుతుందని ఎమ్మెల్యే వెల్లడించారు. నిధుల మంజూరుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జనసేన పార్టీ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాసరావు మాట్లాడుతూ, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తిండి, నిద్రలను కూడా మానుకుని ప్రజల మధ్యనే ఉండి నిరంతరం కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఆయన చూపుతున్న అంకితభావం మరువలేనిదని, ఇటువంటి ఎమ్మెల్యే లభించడం నియోజకవర్గ ప్రజల అదృష్టమని అన్నారు. అనంతరం భారీ ర్యాలీగా నాయకులు రావులపాలెం కళా వెంకట్రావు సెంటర్‌కు చేరుకుని కళా వెంకట్రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్‌లను నియోజకవర్గ ముఖ్య నాయకులు గజమాలతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్డీఏ కూటమి నాయకులు బాణసంచా కాలుస్తూ "ఎన్డీఏ కూటమి వర్ధిల్లాలి" అంటూ నినాదాలతో సంబరాలు జరుపుకున్నారు.

రూ.16 లక్షలు సిఎస్ఆర్ నిధులతో

## డయాలసిస్ సెంటర్ భవన నిర్మాణంకు శంకుస్థాపన

**రామచంద్రపురం కిడ్నీ బాధితులకు తీరనున్న డయాలసిస్ కష్టాలు**

**కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్**



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రామచంద్రపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఆరు పడకల డయాలసిస్ సెంటర్ భవన నిర్మాణానికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి శ్రీ వాసంశెట్టి సుభాష్ గారు శంకుస్థాపన చేశారు. ఈ నిర్మాణానికి రూ.16 లక్షల కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులు ద్వారా నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సమీపంలోనే నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వం ముఖ్య లక్ష్యమని తెలిపారు. డయాలసిస్ వంటి అత్యవసర చికిత్స కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులను ఈ సెంటర్ తొలగిస్తుందని అన్నారు. ప్రభుత్వం ఆరోగ్య రంగ అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని, ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. అలాగే యువనేత నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహకారంతో రాష్ట్రంలో అభివృద్ధి వేగవంతమవుతోందని అన్నారు. ఈ డయాలసిస్ సెంటర్ ద్వారా కిడ్నీ రోగులకు తక్కువ ఖర్చుతో, సులభంగా చికిత్స అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం పట్టణ టీడీపీ వైస్ ప్రెసిడెంట్ చందమామ వాసు, టీడీపీ పట్టణ కార్యదర్శి కవల నానాజీ, టీడీపీ నాయకులు కంచుమర్తి బాబురావు, జనసేన నాయకులు గొల్లపల్లి కృష్ణ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్, జాస్తి చక్రవర్తి విజయలక్ష్మి, స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కోదండ రామాలయ ఆలయ నిర్మాణ శంకుస్థాపన



**రాజోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజోలు మండలం శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వాణి ట్రస్ట్ ఆర్థిక సహకారంతో రాజోలు గౌరవ శాసనసభ్యులు దేవ వర ప్రసాద్ సహకారంతో 10 లక్షల రూపాయలుతో ములికిపల్లి గ్రామంలో జిఎంసి బాలయోగి కాలనీలో నిర్మించే శ్రీ కోదండరామాలయ ఆలయ నిర్మాణ శంకుస్థాపనలో పాల్గొన్న గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్ట్ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, రాజోలు ఎంపీపీ కడలి శ్రీ దుర్గ మోహన్, కస్టర్ సెవెన్ ఇంచార్జ్ చాగంటి స్వామి, టీడీపీ సీనియర్ నాయకులు అడబాల విజయ్ ఈ కార్యక్రమంలో యల్లమెల్లి లక్ష్మణ్ రావు, బొడ్డపల్లి సత్యనారాయణ, గుబ్బల సూరినారాయణ, బుంగ రాజేష్, కోన సన్నీ, చుట్టుగుళ్ల రవి, మానుబోయిన లక్ష్మణ్ రావు, మానుబోయిన మాస్, కోన ప్రవీణ్, బొడ్డపల్లి బోణ సాయిరామ్, పితాని పండు, యల్లమిల్లి రాధ కృష్ణ, కలిగిత నాగేంద్ర బాబు, తదితరులు పాల్గొన్నారు.

## బండారులంక సర్పంచ్‌కు ఘన సన్మానం



**బండారులంక, విశ్వం వాయిస్ న్యూస్ :** బండారులంక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ పెనుమాల సునీత దంపతులను గ్రామస్తులు, పంచాయతీ సిబ్బంది గురువారం ఘనంగా సన్మానించారు. అమలాపురం మండలం బండారులంక గ్రామపంచాయతీ సర్పంచ్ పెనుమాల సునీత ఏడుకొండలు ఐదు సంవత్సరాలు అద్భుతంగా పరిపాలన చేశారని పలువురు అన్నారు. గ్రామ టిడిపి అధ్యక్షులు పిచ్చిక శ్యామ్, శ్రీశైల దేవస్థానం మాజీ పాలకవర్గ సభ్యులు చింతా శంకరమూర్తి,యువనాయకుడు కాశిన బాబి ఆధ్వర్యంలో గజమాలతో సత్కారం చేశారు. సర్పంచ్ పదవీకాలంలో గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం, తాగునీరు, రహదారులు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టడం వల్ల గ్రామం అభివృద్ధి దిశగా ముందుకు సాగిందని గ్రామ పెద్దలు ప్రశంసించారు.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, యువత, మహిళా సంఘాల ప్రతినిధులు కలిసి సర్పంచ్‌ను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. పలువురు ప్రసంగిస్తూ సర్పంచ్ చేసిన సేవలను కొనియాడారు. గ్రామ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసిన నాయకురాలు అని పార్టీలకతీతంగా అనేకమంది పాల్గొని అభివర్ణించారు.సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ ప్రజల సహకారం లేకుండా ఏ అభివృద్ధి సాధ్యంకాదని, అందరి సహకారంతోనే ఈ విజయాలు సాధ్యమయ్యాయని అన్నారు. భవిష్యత్తులో కూడా గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యురాలు పుణ్యమంతుల రజిని,బూత్ కమిటీ అధ్యక్షులు కొండా సత్యనారాయణ రాజు, యువనాయకులు ఈతకోట రాజేష్, మల్లవరపు ఏడుకొండలు, దంగేటి శ్రీరామ్, కరాటం ప్రవీణ్, గంగుమళ్ళ ఏసుబాబు,గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రావులపాలెంలో ప్రజాదర్బార్ నిర్వహించిన

## టీడీపీ యువ నాయకులు బండారు సంజీవ్



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశాల మేరకు, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రావులపాలెం క్యాంప్ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ యువ నాయకులు బండారు సంజీవ్ శుక్రవారం 'ప్రజాదర్బార్' నిర్వహించారు. ఎమ్మెల్యే అందుబాటులో లేని సమయంలో ప్రజలకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా మొత్తం 32 అర్జీలు అందాయి. ప్రజల సమస్యలను సావధానంగా విన్న సంజీవ్, వాటిలో కొన్నింటిని సంబంధిత అధికారుల దృష్టికి ఫోన్ ద్వారా తీసుకెళ్లి తక్షణ పరిష్కారానికి చొరవ చూపారు. మిగిలిన వినతులను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దృష్టికి తీసుకెళ్ళి, అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చూస్తానని ప్రజలకు భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వారికి చేదోడువాదోడుగా ఉంటూ, నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని సంజీవ్ తెలిపారు. తమ సమస్యలను శ్రద్ధగా విని, ఎమ్మెల్యే గారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా కృషి చేస్తున్నందుకు స్థానిక ప్రజలు యువ నాయకులు సంజీవ్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే బండారుకు, కూటమి ప్రభుత్వానికి

## అభినందనలు తెలిపిన బొక్కా ప్రసాద్



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కోనసీమవాసుల కల నెరవేర్చిన బండారు రూ.74.20 కోట్లతో లొల్ల లాకులు ఆధునీకరణ ఎమ్మెల్యే బండారుకు, కూటమి ప్రభుత్వానికి అభినందనలు తెలిపిన టీడీపీ యువనాయకుడు బొక్కా ప్రసాద్ కోనసీమ ప్రాంత ప్రజల దశాబ్దాల కల అయిన లొల్ల లాకులు ఆధునీకరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.74.20 కోట్ల నిధులు మంజూరు చేయడం అభినందనీయమని బొక్కా ప్రసాద్ తెలిపారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రత్యేక కృషి ఫలితంగా ఈ ప్రాజెక్టుకు ప్రభుత్వం పరిపాలనా అనుమతి ఇవ్వడం కోనసీమ రైతులకు గొప్ప శుభవార్త అని అన్నారు.ఆనాడు నారా లోకేష్ యువగళం పాదయాత్ర ముక్కామల - రావులపాలెం మార్గంగా కొనసాగి ఆవిడి గ్రామం చేరుకునే సమయంలో 2900 కిలోమీటర్ల మైలురాయి ఏర్పాటు చేయాల్సిన మైల్ స్టోన్ పై నాలుగు ముఖ్య హామీలను ప్రతిపాదించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కోనసీమ రైతుల మేలు కోసం ఆత్రేయపురం మండలంలోని లొల్ల లాకులు ఆధునీకరణ, రావులపాలెం మండలంలో జ్యోతిరావు పూలే పేరుతో బీసీ కళ్యాణ మండపం, కొత్తపేటలో అంబేద్కర్ పేరుతో ఎస్సీ కళ్యాణ మండపం, ఆలమూరు ప్రభుత్వ ఆసుపత్రి అప్‌గ్రేడ్ వంటి అంశాలను అప్పుడే ప్రతిపాదించడం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ముందుచూపుని చూపిందన్నారు.మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టు కారణంగా యువగళం పాదయాత్ర మధ్యలో ఆగిపోవడంతో ఆ ప్రాంతంలో మైల్ స్టోన్ ఏర్పాటు జరగకపోయినా, అసెంబ్లీలో మాత్రం లొల్ల లాకుల ఆధునీకరణ కోసం ఎమ్మెల్యే బండారు గళం ఆగలేదని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా కొత్తపేట నియోజకవర్గ శాసనసభ్యులు బండారు సత్యానందరావుకి,ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి, యువనేత నారా లోకేష్‌కి, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకి బొక్కా ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా రైతులకు పెద్ద ఎత్తున ప్రయోజనం కలుగుతుందని ఆయన అన్నారు.

శ్రీ పార్వతి సమేత కుండలేశ్వర స్వామిని దర్శించుకున్న

## రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి అదనపు కమిషనర్



**కాట్రేనికోన విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా, కాట్రేనికోన మండలంలో వేచి ఉన్న పవిత్ర పుణ్య క్షేత్రం కుండలేశ్వరంలో వేంచేయున్న శ్రీ పార్వతి సమేత కుండలేశ్వర స్వామి వారిని శుక్రవారం సాయంత్రం రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి అదనపు కమిషనర్ డాక్టర్ యం సుధాకర్ కుటుంబ సమేతంగా దర్శించు కొన్నారు. వారికి ప్రజా ప్రతినిధులు అధికారులు ఘన స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకులు కాళ్ళకూరి నాగ మల్లేశ్వర శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు పూర్ణ కుంభతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన కుండలేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణ లో గల రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి, కనక దుర్గమ్మ తల్లి, ఆంజనేయ స్వామి వారినీ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాట్రేనికోన ఎంపీడీఓ బి.రాజేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీఓలు శంకర్ నారాయణ, సూర్య నారాయణ రాజు, పంచాయతీ కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

ఏపీ సర్పంచుల పదవీ కాలం ముగింపు

## స్పెషల్ ఆఫీసర్ల నియామకం

**పొడగట్లపల్లి గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్‌గా**

**ఏవో మంగతాయారు బాధ్యతలు స్వీకరణ**



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో గ్రామ పంచాయతీల పాలనలో కీలక మార్పు చోటుచేసుకుంది. ఏప్రిల్ 2తో ప్రస్తుత సర్పంచుల పదవీ కాలం పూర్తి అయ్యింది. దీనికి సంబంధించి ప్రభుత్వం జీ.వో.ఎంఎస్.ఎన్ఓ-47 విడుదల చేసింది.ఏప్రిల్ 3 నుండి స్పెషల్ ఆఫీసర్ల పాలన ప్రారంభించడమైనది. తహశీల్దార్, ఎంపీడీవోలు, ఎం.ఈ.ఓ లకు బాధ్యతలు అప్పగించారు. పంచాయతీ ఎన్నికలు జరిగే వరకు వీరే బాధ్యులుగా ఉంటారు. కలెక్టర్లకు నియామక బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రావులపాలెం మండలం, పొడగట్లపల్లి గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్‌గా ఏవో మంగతాయారు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం గుడ్ ఫ్రైడే అయినా కానీ బాధ్యతలు స్వీకరణ జరిగింది. పొడగట్లపల్లి సచివాలయ సిబ్బంది పంచాయతీ సిబ్బంది, ఆశా వర్కర్లు ఈ పదవి బాధ్యత స్వీకరణ కార్యక్రమానికి విచ్చేసి స్పెషల్ ఆఫీసర్ మంగతాయారును అభినందించారు.

కోనసీమ ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్న

## లొల్ల లాకులు ఆధునికీకరణకు నిధులు మంజూరు

**కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** రూ.74.20 కోట్లతో లొల్ల లాకులు ఆధునీకరణ నిధుల మంజూరు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,యువ నాయకుడు లోకేష్ బాబుకి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ని స్వయంగా కలిసి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దశాబ్దాల కల కోనసీమ ప్రాంత ప్రజలు ఎదురుచూస్తున్న లొల్ల లాకులు ఆధునీకరణకు ప్రభుత్వం ఎట్టకేలకు నిధులు మంజూరు చేసింది నాలుగోసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుండి లొల్ల లాకులు ఆధునికరంపై ప్రత్యేక దృష్టి పెట్టారు.ఇందుకు ప్రభుత్వం సహకరించింది నిధులు మంజూరు చేసింది.ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం, జలవనరుల శాఖ - గోదావరి సెంట్రల్ డెల్టా వ్యవస్థ ఆధునీకరణ - ఆత్రేయపురం గ్రామం సమీపంలోని జీసీ ప్రధాన కాలువ కి మీ.13.200 వద్ద ఉన్న లొల్ల మరియు రాలి వేర్, లాక్స్ మరియు ఇప్పటికే ఉన్న లాక్స్, వేర్లు, వంతెనల దిగువ భాగంలో డిఎల్ ఆర్‌బి పునర్నిర్మాణానికి పరిపాలనా అనుమతి మంజూరు చేసింది జలవనరుల శాఖ జి.ఓ.ఆర్.టి. నెం. 175 డిఎల్ ఆర్‌బి పునర్నిర్మాణానికి రూ.77.40 కోట్లు (అంచనా) వ్యయంతో పరిపాలనా అనుమతి మంజూరు చేయాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చేసిన ప్రతి పాదనను ప్రభుత్వం జాగ్రత్తగా పరిశీలించి రూ.74.20 కోట్లు పరిపాలనా అనుమతి మంజూరు చేస్తోంది.లొల్ల లాకులు నుండి మూడు పంట కాలువలు పునర్నిర్మాణం ద్వారా రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించడంతోపాటు పల్లంకురు వద్ద బ్రిడ్జి నిర్మాణానికి నిధులు వినియోగించనున్నారు. అమలాపురం పార్లమెంట్ పరిధిలోని కోనసీమ ప్రాంతంలో గల ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన రైతులకు మేలు జరగనుంది.

ఉగాది పురస్కార గ్రహీత వీర్నాల రమణబాబును

## సత్కరించి అభినందనలు తెలియజేసిన సీఆర్సీ రూపకర్త

**గ్రామ మాజీ సర్పంచ్ గోలుగూరి వెంకటరెడ్డి**

**సీఆర్సీ కార్యదర్శి వీరరాఘవరెడ్డి, రమణబాబును సత్కరించిన పలువురు బీజేపీ నాయకులు**



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** పురస్కార గ్రహీత వీర్నాలను సత్కరించిన గ్రామ మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి. పలువురు బీజేపీ నాయకులు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నుండి ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతులు మీదుగా ఉగాది పురస్కారం అందుకున్న రావులపాలెంకు చెందిన జానపద కళాకారుడు. బీజేపీ కార్యకర్త వీర్నాల రమణబాబును గురువారం నాడు రావులపాలెంలో సీఆర్సీ రూపకర్త.గ్రామ మాజీ సర్పంచ్. విక్టరి బజార్స్ అధినేత గోలుగూరి వెంకటరెడ్డి. సీఆర్సీ సెక్రటరీ వీరరాఘవరెడ్డి సాల్వాలతో సత్కరించి అభినందించారు ఈ సందర్భంగా వెంకటరెడ్డి. వీరరాఘవ రెడ్డి మాట్లాడుతూ వివిధ రంగాల్లో ప్రతిభను సాటుతున్న వారిని గుర్తించి కళాకారులకు ప్రభుత్వాలు పురస్కారాలను ప్రధానం చేయడం రావులపాలెం వాసిగా వీర్నాల అవార్డును పొందడం సంతోషంగా ఉందన్నారు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంకు చెందిన పలువురు బీజేపీ నాయకులు రమణబాబును సాల్వాలతో సత్కరించి అభినందనలు తెలిపారు ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు గోనెమడతల కనకరాజు, నాగిరెడ్డి స్వామి, గండ్రోతు వీరగోవిందరావు. కొవ్వూరి వెంకటకృష్ణారెడ్డి.భీమలా గంగరాజు.సుంకర శ్రీరామ్.మంచిగంటి రామకృష్ణ,మండవిల్లి సతీష్,జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

## భారత్ ఘర్షణకు దిగితే తీవ్ర పరిణామాలు : ఖవాజా ఆసిఫ్

**విశ్వం వాయిస్ న్యూస్ :** పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి భారత్‌పై అక్కసు వెళ్లగక్కారు. పహల్గాం దాడి జరిగి ఏడాది కావస్తున్న నేపథ్యంలో భారత్ తమపై బెదిరింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. ఇవన్నీ చూస్తుంటే వారు తమపై దాడులకు ప్రణాళికలు రచిస్తూ..రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తున్నట్లు అనిపిస్తోందన్నారు. మరోసారి తమతో ఘర్షణకు దిగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. తమపై జరిగే దాడులను వేగవంతమైన, ప్రణాళికాబద్ధమైన ప్రతిస్పందనతో తిప్పికొడతామన్నారు. ఇరాన్ యుద్ధాన్ని అవకాశంగా తీసుకొని పొరుగుదేశం ఏదైనా దుస్సాహసానికి పాల్పడితే ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని ఇటీవల కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ పాక్‌ను హెచ్చరించారు. ఉరి సెక్టార్ దాడి తర్వాత జరిపిన సర్జికల్ స్ట్రైక్స్, పుల్వామా తర్వాత వైమానిక దాడులు, పహల్గాం దాడుల అనంతరం ఆపరేషన్ సిందూర్‌లను గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో ఖవాజా ఆసిఫ్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

## ఘనంగా గుడ్ ఫ్రైడే ఆరాధనలు



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబాజీపేటలోని కల్వరి క్రైస్తవ ప్రార్థన మందిరంలో గుడ్ ఫ్రైడే సందర్భంగా విశేష ఆరాధనలు ఘనంగా నిర్వహించబడినవి. ఈ కార్యక్రమం సిహెచ్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు బిషప్ జె.జార్జి అధ్యక్షతన ఎంతో ఆత్మీయంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రసంగించిన రెవ డాక్టర్ జె.విక్టర్ కుమార్, డాక్టర్ చవ్వకుల జాన్ మోజస్, పాస్టర్ ప్రభు రాజేష్ యేసుక్రీస్తు శిలువ మరణం యొక్క మహిమ, ప్రేమ, మరియు మనుష్యుల పాప విమోచన కోసం చేసిన త్యాగాన్ని విశదీకరించారు. విశ్వాసులను ఆత్మపరిశీలనకు పిలుపునిచ్చి, శిలువ సందేశాన్ని తమ జీవితాల్లో ఆచరించాలని సూచించారు. ఈ ఆరాధనలో విశేష సంఖ్యలో విశ్వాసులు పాల్గొని ప్రార్థనలు, స్తోత్ర గీతాలు ద్వారా దేవునికి మహిమ అర్పించారు. కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తిశ్రద్ధలతో ఉదయం 9 గంటల నుండి మద్యనం 3 గంటలకు ముగిసింది.



# ఆంధ్రప్రదేశ్‌లో ముగిసిన సర్పంచుల పాలన...!

## 3న కొలువు దీరిన ప్రత్యేక అధికారులు - ఎన్నికలు జరిగే వరకూ ప్రత్యేక అధికారులే... ప్రత్యేక అధికారుల పాలన ఆరు నెలలే...

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** 1 ఏప్రిల్ 2021 న ఉదయం 10.40 గంటలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా పదవీ బాధ్యతలను చేపట్టిన పంచాయతీ సర్పంచులు, వార్డు సభ్యుల అధికారిక ఐదేళ్ల పదవీ పరిపాలనా కాలం నేటి గురువారం 02.04.2026 అర్ధరాత్రి 12 గంటలతో అధికారికంగా ముగిసిపోయింది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రంలో మొత్తం 688 మండలాలు ఉండగా వీటిలో మొత్తం13,351 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2021లో ఎన్నికైన ఈ సర్పంచులు, వార్డు సభ్యుల పదవీ కాలం పూర్తయ్యింది. ఐదేళ్ల పదవీకాలం ముగియడంతో సర్పంచులు, పాలకవర్గాల సభ్యులు తమ బాధ్యతల నుంచి శుక్రవారం తప్పుకున్నారు. దీంతో పంచాయతీల పాలన కుంటు పడకుండా ఉండేందుకు, పంచాయతీల నిర్వహణ కోసం ప్రత్యేక అధికారులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొత్తగా ఎన్నికలు జరిగి, పాలక వర్గాలు కొలువుదీరే వరకూ గ్రామాల్లో పాలన కుంటు పడకుండా ప్రత్యేక అధికారుల వ్యవస్థను ఏర్పాటు చేసింది. గ్రామ పంచాయతీలకు తహశీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈఓ, ఐసిడిఎస్.సిడిపీఓ, మండల వ్యవసాయ, ఉద్యానవన అధికారులు, ఇతర గెజిటెడ్ స్థాయి అధికారులను ప్రత్యేక అధికారులుగా (స్పెషల్ ఆఫీసర్లు)గా నియమిస్తూ గ్రామ పంచాయతీల ప్రత్యేక



అధికారుల నియామకం జీవో.ఎంఎస్.నెం. 47 ద్వార మార్చి 20 న ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. దీంతో ఎన్నికలను నిర్వహించే వరకు ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఐసిడిఎస్ సిడిపీఓలు, డిప్యూటీ ఎంపీడీవోలు తదితర ఇతర మండల స్థాయి గజిటెడ్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ ఆయా జిల్లాల కలెక్టర్లు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కలెక్టర్లు ఇప్పటికే తమ పరిధిలోని గ్రామాలకు ప్రత్యేక అధికారుల నియామక ప్రక్రియ పూర్తి చేశారు. ఫలితంగా ఆంధ్రప్రదేశ్‌లో శుక్రవారం గుడ్ ఫ్రైడే 3 ఏప్రిల్ 2026 నుంచి గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారులుగా తహశీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈఓలు, ఐసిడిఎస్ సిడిపీఓలు, ఇతర గెజిటెడ్ హోదా అధికారులు ప్రత్యేక అధికారులుగా బాధ్యతలను స్వీకరించారు. దీంతో ప్రత్యేక అధికారుల పాలన అధికారికంగా ప్రారంభమైంది. ఈ అధికారులు గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ వంటి అత్యవసర సేవలతో పాటు, నిధుల విడుదల కోసం ఉపయోగించే చెక్ పవర్ ఇకపై ఈ అధికారులకే ఉంటుంది. కొత్తగా ఎన్నికలు జరిగి పాలకవర్గాలు కొలువుదీరే వరకూ ఈ ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుంది. రాష్ట్ర కొత్త ఎన్నికల కమిషనర్ నియామకం పూర్తయ్యాక ఎన్నికల ప్రక్రియపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అంత వరకూ ఇక ఈ ప్రత్యేక అధికారులే పంచాయతీల పాలకులుగా కొనసాగుతారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, పట్టణ సంస్థలకు సంబంధించి మార్చి 10న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 11 నగర పాలక సంస్థలకు సంబంధిత జిల్లా కలెక్టర్లను ప్రత్యేక అధికారులుగా నియమించింది. 75 పురపాలక సంఘాలకు కూడా ప్రత్యేక అధికారులను నియమించింది. ఈ కొత్త పాలకవర్గాలు ఎన్నికయ్యే వరకు లేదా 6 నెలల కాలం పాటు వీరు బాధ్యతల్లో కొనసాగుతారు.

### ఎమ్మెల్యే అరవిందబాబు ఎపిసోడ్..

# సీఎం సీరియస్ వార్నింగ్!



పల్నాడు జిల్లా నరసారావుపేట ఎమ్మెల్యే అరవిందబాబు ప్రవర్తనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తన అనుచరుడికి కాంట్రాక్టు ఉద్యోగంలో నియమించే విషయమై పల్నాడు జిల్లా ఎస్పీ ఆఫీసులో ఎమ్మెల్యే రచ్చ చేయడాన్ని ముఖ్యమంత్రి సీరియస్ గా తీసుకున్నారు. ఈ విషయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఫోన్ చేసినా ఎమ్మెల్యే వినిపించుకోకుండా గొడవ చేశారని ముఖ్యమంత్రికి నివేదిక అందిందని అంటున్నారు. పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘించేలా ఎమ్మెల్యే అరవిందబాబు వ్యవహరించారని భావిస్తూ, ఆయన కఠిన చర్యలు తీసుకోవాలని పార్టీ యంత్రాంగాన్ని సీఎం ఆదేశించారని ప్రచారం జరుగుతోంది. ఎమ్మెల్యే అరవిందబాబు ఎపిసోడ్ టీడీపీ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. ఒక చిన్న ఉద్యోగం విషయంలో ఎమ్మెల్యే అలా ప్రవర్తించడం సరికాదని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎమ్మెల్యే స్వయంగా ఎస్పీ కార్యాలయానికి వెళ్లడం, ఎస్పీతో గొడవ పెట్టుకోవడమే కాకుండా, ఐజీ స్థాయి అధికారి వచ్చి వివరణ ఇస్తున్నా లెక్క చేయకపోవడాన్ని ప్రభుత్వం సీరియస్ గా తీసుకుందని అంటున్నారు. ఇది పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘించడంగానే భావిస్తూ అరవింద బాబుకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని సీఎం ఆదేశించినట్లు ప్రచారం జరుగుతోంది. ఇక ఎస్పీ కార్యాలయంలో రచ్చకు దిగిన ఎమ్మెల్యే అరవిందబాబుతో మాట్లాడేందుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రయత్నించినా, ఎమ్మెల్యే లెక్క చేయలేదన్న సమాచారంతో సీఎం చంద్రబాబు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారని చెబుతున్నారు. ఈ పరిణామాలతో షాక్ కు గురైన ఎమ్మెల్యే అరవిందబాబు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లాకు ఫోన్ చేసి వివరణ ఇచ్చే ప్రయత్నం చేశారని అంటున్నారు. అయితే అధినేత చంద్రబాబు ఆదేశాలతో ఫోన్ లో వివరణ తీసుకునేందుకు పల్లా సైతం అంగీకరించలేదని, పార్టీ కేంద్ర కార్యాలయానికి వచ్చి వ్యక్తిగతంగా వివరణ ఇవ్వాలని సూచించినట్లు చెబుతున్నారు. ఎమ్మెల్యే అరవిందబాబు వ్యవహారంపై బుధవారమే ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. మైండ్ కంట్రోల్ లో లేకపోవడం వల్లే ఇలాంటి ప్రవర్తనకు కారణమవుతోందని తీవ్రవ్యాఖ్యలు చేశారు. తిరుపతి జిల్లాలో పర్యటించిన సీఎం ఓ బహిరంగ సభలోనే ఘాటు వ్యాఖ్యలు చేశారు. తమ పార్టీ ఎమ్మెల్యే ఓ ఆఫీసుపై పడ్డాడు. ఎవరైనా మైండ్ కంట్రోల్ లో పెట్టుకోవాలి అంటూ తీవ్రవ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యే అరవింద బాబు ప్రవర్తనపైనే సీఎం ఇలాంటి వ్యాఖ్యలు చేశారని ప్రచారం జరగడంతో ఆయన నష్టనివారణకు దిగినట్లు చెబుతున్నారు. అయితే అప్పటికే ఎమ్మెల్యే అరవింద బాబు విషయంలో కఠినంగా వ్యవహరించాలని సీఎం సూచించారని అంటున్నారు. దీంతో ఎమ్మెల్యే విషయంలో పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే ఉత్కంఠ నెలకొంది. గతంలోనూ ఎమ్మెల్యేపై ఇటువంటి ఫిర్యాదులు ఉండటంతో అధిష్టానం సీరియస్ గా ఉన్నట్లు చెబుతున్నారు.

# ప్రతి 3 నెలలకోసారి గొడవ పడటం పేర్ని నానికి అలవాటా?



అప్పుల అప్పారావు.. సంబరాల రాంబాబు.. పేకాట పాపారావు.. లాంటి పాపులర్ తెలుగు సినిమాల గురించి తెలియని వారుండరు. అలానే తెలుగు రాజకీయాల్లో.. మరి ముఖ్యంగా ఏపీ పాలిటిక్స్ విషయానికి వస్తే.. పంచాయితీల పేర్ని నాని గురించి తెలియని వారు ఉండరనే చెప్పాలి. అదే పనిగా విరుచుకుపడటం.. వెనుకా ముందు చూసుకోకుండా మాట్లాడటం.. నువ్వెంత అంటే నువ్వెంత? అన్నట్లుగా నిప్పులు చెరగటం లాంటివి పేర్ని నానికి ఉన్న సుగుణాల్లో కొన్ని. ఏపీలో కూటమి ప్రభుత్వం కొలువు తీరిన నాటి నుంచి ఇప్పటివరకు గడిచిన కాలాన్ని నిశితంగా పరిశీలిస్తే ఒక ఆసక్తికర కోణం కనిపిస్తుంది. అదేమంటే.. ప్రతి మూడు.. నాలుగు నెలలకు ఒకసారి ఏదో ఒక అంశంపై రచ్చ చేయాల్సిందే. ఏదో ఒక అధికారిని నోటికి వచ్చినట్లు తిట్టిపోయాల్సిందే. ఆసక్తికర అంశం ఏమంటే.. ఆయన ఎన్ని మాటలు అన్నా.. మహా అయితే కేసులు నమోదు అవుతాయే తప్పించి.. చర్యల కర్ర మాత్రం బయటకు రాదు. ఈ కారణంతోనే.. తరచూ పూనకం వచ్చినోడిగా అధికార కూటమి ప్రభుత్వాన్ని ఇష్టారాజ్యంగా ఆడిపోసుకోవటంలో పేర్ని ట్రాక్ రికార్డును ఎవరూ బీట్ చేయలేరనే చెప్పాలి. కూటమి ప్రభుత్వం కొలువు తీరిన నాటి నుంచి ఇప్పటివరకు పేర్ని నానిపై ఐదు నుంచి ఆరు కేసులు ప్రధానంగా నమోదైనట్లుగా రికార్డులు చెబుతుంటాయి. ఆశ్చర్యకరంగా ఆయనపై ఒక్కసారి అంటే ఒక్కసారి కూడా చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించవు. ఆయనపై ఇప్పటివరకు నమోదైన కేసుల్ని చూస్తే.. చాలా సందర్భాల్లో ప్రభుత్వ పెద్దలపైనా.. అధికారులపైనా బెదిరింపులకు దిగటం.. విధులకు ఆటంకం కలిగించే కేసులు ఆయనపై ఇప్పటికే నమోదయ్యాయి. అయినా ఒక్కకేసులోనూ ఆయన అరెస్టు కాని ఇస్పెషల్ నేతగా పేర్ని నానిని చెప్పాలి.

కూటమి ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత పేర్ని నానిపై నమోదైన కేసుల్ని చూస్తే..

**డిసెంబరు 2024 :** రేషన్ బియ్యం అక్రమ రవాణాకు సంబంధించిన కేసులో పేరు ప్రస్తావనకు రావటం.. పెద్ద ఎత్తున ఆరోపణలు ఎదుర్కొన్నా.. ఎలాంటి చర్యలు ఆయనపై తీసుకోలేదు.

**జూలై 2025 :** అవనిగడ్డ.. పామర్రు నియోజకవర్గాల్లో జరిగిన పార్టీ సమావేశాల్లో “రప్ప రప్ప” వంటి వివాదాస్పద పదజాలం వాడుతూ, హింసను ప్రేరేపించేలా మాట్లాడారనే ఆరోపణలపై కేసులు.

**అక్టోబరు 2025 :** మచిలీపట్నం పోలీస్ స్టేషన్‌లో మేకల వెంకట సుధాకర్ బాబు అనే నిందితుడ్ని విచారిస్తున్న సమయంలో అక్కడికి వెళ్లిన పేర్ని నాని.. అధికారులను బెదిరించారన్న ఆరోపణ. అంతేకాదు.. పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు బీఎన్ఎస్ సెక్షన్లు 61(2), 132, 126(2), 189(2), 190 కింద కేసు నమోదైంది.


**జనవరి 2026 :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో ఇనగుదురు, మచిలీపట్నం పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు.

**మార్చి 2026 :** మచిలీపట్నంలో జనసేన జెండా ఆవిష్కరణ సందర్భంగా సెక్షన్ 30 నిబంధన అమల్లో ఉన్నా.. దాన్ని అతిక్రమించి పోలీసులతో వాగ్వాదం

**ఏప్రిల్ 2026 :** మచిలీపట్నంలోని ఆరో వార్డులో ఆక్రమణల తొలగింపు సమయంలో విధుల్లో ఉన్న అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు.. ఇతర అధికారులను ‘మా ప్రభుత్వం వచ్చాక మీ అంతు చూస్తాం’ అని బహిరంగంగా హెచ్చరించారు. ఈ ఘటనపై ఆయనతో పాటు ఆయన కుమారుడు పేర్ని కిట్టుపై కూడా పోలీసులు కేసు నమోదు.

# విజయ్ రెండు చోట్ల పోటీ..

## ఎన్నికల అఫిడవిట్లలో తేడాలు



**విశ్వం వాయిస్ న్యూస్ :** తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తోన్న విషయం తెలిసిందే. పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ స్థానాల్లో నామినేషన్ వేయగా.. ఇందుకు సంబంధించి విజయ్ సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌లలో తేడాలు ఉన్నట్లు తెలిసింది. దీంతో ఎన్నికలకు ముందు ఈ వ్యవహారం న్యాయ పరిశీలనకు దారితీయవచ్చని పలువురు అంటున్నారు. పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ అసెంబ్లీ స్థానాల కోసం రూపొందించిన అఫిడవిట్‌లలో పెండింగ్ క్రిమినల్ కేసులు, ఎన్నికల బ్యాంకు ఖాతాలకు సంబంధించిన వివరాలు విరుద్ధంగా ఉన్నట్లు సమాచారం. పెరంబూర్‌లో ఇచ్చిన అఫిడవిట్‌లో ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని పేర్కొన్నట్లు తెలిసింది. అదే తిరుచ్చి ఈస్ట్ కోసం సమర్పించిన నామినేషన్ పత్రాల్లో పెండింగ్‌లో రెండు ఎఫ్ఐఆర్‌లు ఉన్నట్లు పేర్కొనడం గమనార్హం. మరోవైపు, ఎన్నికల ఖర్చు కోసం ఒక బ్యాంకు ఖాతా తెరిచామని, ఇందులో రూ.లక్ష రూపాయలు ఉన్నట్లు పెరంబూర్ అఫిడవిట్‌లో పేర్కొనగా.. తిరుచ్చి అఫిడవిట్‌లో మాత్రం రెండు బ్యాంకు ఖాతాలు ఉన్నాయని పేర్కొన్నట్లు తెలిసింది. అయితే, ఇలా ఎన్నికల అఫిడవిట్‌లో వాస్తవాలను దాచిపెట్టడం లేదా తప్పుగా పేర్కొనడం ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం తీవ్రమైన ఉల్లంఘన కిందకే వస్తుందని న్యాయ నిపుణులు చెబుతున్నారు.

# అమరావతి రైతులకు సెల్యూట్..

## కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు భావోద్వేగం

రాజధాని అమరావతి బిల్లుపై రాజ్యసభలో చర్చ సందర్భంగా కేంద్రమంత్రి రామ్మోహననాయుడు తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులు, మహిళలకు పార్లమెంటు సాక్షిగా సెల్యూట్ చేస్తున్నానని ప్రకటించారు. 29 వేల మంది రైతులు విశాల హృదయంతో ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా ప్రపంచస్థాయి రాజధాని నిర్మాణానికి భూములు త్యాగం చేశారని రామ్మోహన్ నాయుడు కొనియాడారు. బుధవారం లోక్ సభ ఆమోదించిన అమరావతి బిల్లును రాజ్యసభలో గురువారం ప్రవేశపెట్టారు. రాజ్యసభలో అమరావతిపై ప్రవేశపెట్టిన బిల్లుపై ఆసక్తికర చర్చ కొనసాగింది. వైసీపీ మినహా మిగిలిన అన్ని పార్టీలు బిల్లును సమర్థించాయి. జాతీయ పార్టీలు అయిన బీజేపీ, కాంగ్రెస్ సైతం చర్చలో పాలుపంచుకున్నాయి. కేంద్రం తరఫున టీడీపీకి చెందిన మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడారు. రాజధాని అమరావతి కోసం భూములను త్యాగం చేసి, ఎన్నో ఏళ్లుగా సాగిన పోరాటంలో దృఢంగా నిలబడిన రైతులు, మహిళలకు ధన్యవాదాలు తెలిపారు. అమరావతి బిల్లును తెలుగు ప్రజలంతా గర్వంగా భావిస్తున్నారని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వ్యాఖ్యానించారు. రాష్ట్ర విభజన తర్వాత రాజధాని లేని రాష్ట్రంగా ఏపీ మారిందని.. ఈ రోజు ఆ లోటు భర్తీ అయిందని ఆనందం వ్యక్తం చేశారు. ఏపీ విభజన జరిగిన తీరుకు తాము వ్యతిరేకమని.. రాజధాని బిల్లు ఎందుకు తెచ్చారనేది అందరూ తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాజధాని లేని రాష్ట్రంగా ఉన్నప్పటికీ ఏపీని ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని రామ్మోహన్ నాయుడు తెలిపారు. మాజీ ప్రధాని వాజపేయి హయాంలో మూడు రాష్ట్రాల విభజన జరిగిందని, ఆ సమయంలో ఎలాంటి ఇబ్బందులూ రాలేదన్నారు. ఏపీ విభజన సమయంలో రాజధాని లేకుండా వదిలేయడంతోనే సమస్య మొదలైందన్నారు. ఆ సమయంలో రాష్ట్రానికి రూ.16 వేల కోట్ల



రెవెన్యూ లోటు ఉందని చెప్పుకొచ్చారు. 2019 నుంచి 2024 వరకు ఏపీలో చీకటి రోజులు రాజ్యమేలాయని కేంద్రమంత్రి విమర్శించారు. మూడు రాజధానుల పేరుతో గందరగోళం సృష్టించారని, రాజధాని కోసం ఉద్యమించిన రైతులను తీవ్రంగా హింసించారని కేంద్ర మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు, గర్భిణులపైనా పోలీసులతో లాఠీ చార్జి చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణా నది తీరంలో అమరావతి నిర్మించాలనేది ఏపీ ప్రభుత్వ నిర్ణయమని, ఐకానిక్, వరల్డ్ క్లాస్ రాజధానిగా నిర్మాణం జరుగుతోందని కేంద్ర మంత్రి రాజ్యసభలో వివరించారు. ఇక ఈ చారిత్రక చర్చను టీడీపీ యువనేత, మంత్రి లోకేశ్ రాజ్యసభ గ్యాలరీ నుంచి వీక్షించారు. ఆయనతోపాటు టీడీపీకి చెందిన లోక్ సభ సభ్యులు అంతా గ్యాలరీలో కూర్చుని చర్చను చూశారు.


# నాపైన దాడి కుట్ర అతనిదే...

## రఘురామ బిగ్ ట్విస్ట్

తన మీద ఇస్మాయిల్, రాజేష్ ఖనాన్, మీసాల రాజు హింసకు ప్రేరేపించారు అని రఘురామ క్రిష్ణం రాజు ఆరోపిస్తున్నారు. శ్రీరామ నవమి రోజు అంటే మార్చి 27న ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామ క్రిష్ణం రాజు పశ్చిమ గోదావరి జిల్లాలోని ఆకివీడులోని శ్రీరామ ఆలయంలో పూజలు చేసేందుకు వెళ్ళారు. ఆ సమయంలో కొందరు వ్యక్తులు ఆయన పైన దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో రఘురామ తో పాటు పలువురు కూటమి నేతల మీద కూడా దాడి జరిగింది. దాంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. క్షణాలలో అది వైరల్ గా మారింది. ఏపీ డిప్యూటీ స్పీకర్ మీద దాడి అంటే మామూలు విషయం అయితే కాదు కదా. దాంతో సోషల్ మీడియా మెయిన్ స్ట్రీం మీడియా హోరెత్తింది. మరి ఆయన మీద ఎవరు దాడికి పాల్పడి ఉంటారు సూత్రధారులు ఎవరు అన్న చర్చ అయితే ఉంది. కానీ రఘురామ తనపైన దాడికి తెర వెనక సూత్రధారులు ఉన్నారని చెబుతూ ఆయనేనని ఒక పేరుని చెప్పడం ఇపుడు సంచలనం రేపుతోంది.

**హింసకు ప్రేరేపించారు :** తన మీద ఇస్మాయిల్, రాజేష్ ఖనాన్, మీసాల రాజు హింసకు ప్రేరేపించారు అని రఘురామ క్రిష్ణం రాజు ఆరోపిస్తున్నారు. ఇస్మాయిల్ అన్న ఆయన చర్చిని నడుపుతున్నాడని అతనితో పాటు ఆ ఇద్దరూ చేరి ఈ దాడికి స్కెచ్ గీశారని రఘురామ అంటున్నారు. స్థానికంగా ఆలయం కట్టుకుంటే ఇబ్బంది ఏమిటని ఆయన ప్రశ్నించారు. అయితే స్థానికంగా ఉన్న కుర్రాళ్ళను హింసకు ప్రేరేపించేలా చేసి బ్రెయిన్ వాష్ చేసింది ఈ ముగ్గురే అని రఘురామ అన్నారు.

**పీవీ సునీల్‌తో :** ఇక ఈ కేసులో మరో లింక్ ఉందని రఘురామ అంటున్నారు. ఈ ముగ్గురి కాల్ డేటా చూస్తే కనుక వారు మాజీ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ తో ఫోన్ లో ఎక్కువ సార్లు మాట్లాడారు అన్నది సమాచారం ఉందని రఘురామ క్రిష్ణం రాజు చెప్పడం విశేషం. కాల్ డేటా మొత్తం తీస్తే వీరి కుట్ర



బయటపడుతుందని రఘురామ అంటున్నారు. దాడి చేసిన వారిని ప్రేరేపించిన వారిని అసలు వదిలే ప్రసక్తి లేదని రఘురామ స్పష్టం చేశారు. రామాలయం ఉన్న ప్లేస్ లో రామాలయం తిరిగి కడితే తప్పేంటి అని ఆయన ప్రశ్నించారు. ఇలా అభ్యంతరం వ్యక్తం చేయడమేంటని ఫైర్ అయ్యారు.

**పట్టు బిగించి మరీ :** తన మీద జరిగిన దాడిని చాలా ప్రతిష్టగా తీసుకున్నారు రఘురామ క్రిష్ణం రాజు. ఈ కేసులో పాత్ర ధారులనే కాదు సూత్ర ధారులను వదిలేది లేదని ఆయన అంటున్నారు. ఎవరు ఉన్నా కాల్ డేటా సాయంతో ముందుకు రప్పించి తీరుతామని అన్నారు. వారంతా దొరికేస్తారు అని ఆయన ధీమాగా చెప్పారు. మొత్తం మీద చూస్తే ట్రిపుల్ ఆర్ పట్టుదల మీద ఉన్నారు. మరి రఘురామ చేసిన ఈ కామెంట్స్ మీద అవతల వారు ఎలా రియాక్ట్ అవుతారో చూడాల్సి ఉంది.



రాయవరం మండలంలోని అన్ని గ్రామ పంచాయితీలకు

## ప్రత్యేక అధికారుల నియామకం



రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ : ప్రభుత్వ ఉత్తర్వులతో పాటు, తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రాయవరం మండలంలోని 12 గ్రామ పంచాయితీలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ, వారంతా శుక్రవారం ఉదయం తమ బాధ్యతలను స్వీకరించినట్లు ఎంపీడీవో వైఎస్ఎన్ గోపాల్ ప్రకటన ద్వారా తెలిపారు. మండల అభివృద్ధి అధికారి వై.ఎస్.ఎన్. గోపాల్ వెదురుపాక, వి.సావరం గ్రామ పంచాయితీలకు ప్రత్యేక అధికారిగా నియమితులయ్యారని, ఉప మండల అభివృద్ధి అధికారి ఎం. శ్రీనివాసరావు మాచవరం, పసలపూడి గ్రామాలకు బాధ్యతలు చేపట్టారు. మండల సమాజ అభివృద్ధి అధికారి వి.వి.ఆర్. కృష్ణంరాజు చెల్లూరు, కురకాళ్లపల్లి, కుర్మాపురం గ్రామాలకు ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. అదేవిధంగా తహసీల్దార్ బి.వి. భాస్కర్ రాయవరం, లొల్ల గ్రామాలకు నియమితులయ్యారు. గ్రామీణ నీటి సరఫరా శాఖ ఉప ఇంజనీర్ ఎ.జి. రామారావు వెంటూరు గ్రామానికి ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టారు. మండల వ్యవసాయ అధికారి కె.వి.ఎన్. రమేష్ కుమార్ సోమేశ్వరం, నదురుబాద గ్రామాలకు నియమితులయ్యారు. ఈ సందర్భంగా అధికారులు తమ పరిధిలోని గ్రామాల్లో పరిపాలనను సమర్థవంతంగా నిర్వహించి, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయనున్నట్లు ఎంపీడీవో వైఎస్ఎన్ గోపాల్ తెలిపారు.

శ్రీ శ్రీ శ్రీ సోమాలమ్మ అమ్మవారి ఆలయంలో

## ఘనంగా అన్నసంతర్పణ




రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ : రాజమహేంద్రవరం రూరల్ బుచ్చయ్య నగర్‌లో వేంచేసి ఉన్న శ్రీశ్రీ సోమాలమ్మ అమ్మవారి 14వ జాతర మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ధర్మకర్త యసలపు సింహాచలం నాయుడు, చిన్నం ఆనంద్ మాట్లాడుతూ కోరిన కోరికలు తీర్చేటి కల్పవల్లి శ్రీశ్రీశ్రీ సోమాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు గత 14సంవత్సరాల నుండి నిర్విరామంగా శ్రీశ్రీశ్రీ సోమాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని ఉత్సవాల అనంతరం అన్న సమారాధన కార్యక్రమం భారీ స్థాయిలో నిర్వహిస్తామని ఈ అన్న సమారాధనకు సుమారు 3000 మంది పరిసర గ్రామ ప్రజలు హాజరై అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరిస్తారని పేర్కొన్నారు. వైస్ ప్రెసిడెంట్ చెల్లుబోయిన శ్రీను, సెక్రటరీ అట్టాడి శ్రీను, మాదాబత్తుల రాజు, మీసాల రాజు మరియు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, స్థానిక నాయకులు పాల్గొని అన్న సమారాధన కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

అమరావతి సాధనలో

## షరీఫ్ పాత్ర కీలకం

ఆయన్ని రాజ్య సభకు పంపాలి

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి సల్మాన్ హుస్సేన్



మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ : రాష్ట్ర రాజధాని అమరావతి సాధనలో ఏంఏ షరీఫ్ పాత్ర కీలకమని ఆయన్ని రాజ్యసభకు పంపాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి సల్మాన్ హుస్సేన్ పేర్కొన్నారు. విజయం అనేది ఒక్కరి కృషి కాదనీ అనేక మంది త్యాగాలు, పోరాటాలు సహనాల సమాహారం అని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి, అన్ని ఆటంకాలను విద్రోహ చర్యలను అధిగమించి పార్లమెంట్ ఉభయ సభల సమ్మతి పొందడం ఒక చారిత్రాత్మక ఘట్టమన్నారు. త్వరలో రాష్ట్రపతి ఆమోద ముద్ర పడబోతున్న ఈ శుభ తరుణంలో కృతజ్ఞతలు, అవమానాలు, భౌతిక దాడులు ఎదుర్కొని కూడా రాజీ పడకుండా పోరాటం సాగించిన అమరావతి రైతులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. వారి పట్టుదలే ఈ విజయానికి పునాదనీ పేర్కొన్నారు. ఈ ఉద్యమాన్ని చిత్తశుద్ధితో ముందుకు నడిపించిన నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ బీజేపీ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మహోన్నత వ్యక్తి ఎం. ఏ. షరీఫ్ అని కొనియాడారు. అన్నింటికంటే ముఖ్యంగా, అమరావతికి వ్యతిరేకంగా మూడు రాజధానుల ప్రతిపాదనను విధాన మండలిలో రాజ్యాంగబద్ధంగా అడ్డుకుని, అమరావతికి చట్టబద్ధత సాధించడంలో కీలక పాత్ర పోషించిన మాజీ చైర్మన్ ఎం.ఏ.షరీఫ్‌కి ప్రాంతాలకు అతీతంగా ఆంధ్రప్రదేశ్ పౌరులు కృతజ్ఞతలు తెలుపుతున్నారనీ చెప్పారు. అప్పటి వైసీపీ పరిపాలకులు పవిత్ర దేవాలయం లాంటి శాసనమండలిలో షరీఫ్ ని కులం,మతం పేరుతొ దూషించారని ఆరోపించారు. వైసీపీ శాసనమండలి సీనియర్ సభ్యుడు బొత్స సత్యనారాయణ అసభ్యమైన పదజాలంతో దుర్భాషాలడిన ఆ రోజు చట్ట సభలో నీతి,నిజాయతికీ మారు పెరైన చైర్మన్ షరీఫ్ ప్రవర్తించిన తీరు మండలి చరిత్రలో మరపురాని ఘట్టమన్నారు.ఏ ప్రలోభాలకు లొంగకుండా, భౌతిక దాడులను సైతం లెక్కచేయకుండా ధైర్యంగా నిలబడి అమరావతిని సజీవంగా నిలిపిన ఆయన నిబద్ధత నిజంగా అభినందనీయమని కొనియాడారు. అంతటి నిబద్ధత కలిగిన మహనీయుడిని కేవలం ఒక సలహాదారు పదవితో పరిమితం చేయడం సరికాదనీ విమర్శించారు. ఆయన సేవలను విలువలను దేశానికి పరిచయం చేసేలా, పెద్దల సభ అయిన రాజ్యసభకు పంపడం ఎంతైనా సముచితమని పేర్కొన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత

# బీసీలకు అన్యాయం జరుగుతుంది

ఏప్రిల్ 11న అమరావతి ప్రాంతంలో బోడే ఆమరణ నిరాహార దీక్ష

బీసీలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంది : పి.ఎ.సి సభ్యులు అత్తిలి రాజు



రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : ప్రజాస్వామ్యాన్ని పక్కన పెట్టి దమనకారి పాలనను అవలంబిస్తూ బీసీ ప్రజల హక్కులను హరిస్తున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వంపై పి.ఎ.సి సభ్యులు అత్తిలి రాజు తీవ్రంగా ధ్వజమెత్తారు. బీసీల హక్కుల సాధన కోసం ఈ నెల 11న అమరావతి ప్రాంతంలో బీసీవై పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.బీసీ హక్కుల సాధన కోసం బీసీవై పార్టీ ప్రభుత్వం ముందు ఉంచిన ఐదు కీలక డిమాండ్లపై ప్రభుత్వం మొండి వైఖరితో వ్యవహరిస్తోందని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.భారత చైతన్య యువజన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్,ఈ నెల 11న మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా అమరావతిలోని పూలే మండల్ భవన్‌లో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బీసీలకు అన్యాయం జరుగుతోందని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో సమగ్ర కులగణన సక్రమంగా నిర్వహించడం లేదని, జనాభాలో సుమారు 40 శాతం ఉన్న బీసీలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. బీసీ కులాలకు కార్పొరేషన్ నిధులు కేటాయించాలని, విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థలు మరియు చట్టసభల్లో 44 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీల సమస్యల పరిష్కారం కోసం 'బీసీ గర్జన' ద్వారా ఐదు ప్రధాన డిమాండ్లను ఇప్పటికే ప్రభుత్వానికి తెలియజేసినా స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. రాజమండ్రి నియోజకవర్గ కన్వీనర్ వనుము శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో కోట్లాది బీసీల హక్కులు నిర్లక్ష్యం చేయబడుతున్నాయని, వారిని సంక్షేమ పథకాలకే పరిమితం చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ సందర్భంగా బోడె రామచంద్ర యాదవ్ నేతృత్వంలో ప్రభుత్వం ముందు ఉంచిన ఐదు ప్రధాన డిమాండ్లు ఇవీ: బీసీ రక్షణ చట్టం అమలు చేయాలి, అమరావతి ప్రాంతంలో 1000 ఎకరాలు బీసీలకు కేటాయించాలి, విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థలు మరియు చట్టసభల్లో 44% రిజర్వేషన్ కల్పించాలి, బీసీ కార్పొరేషన్ నిధులు వెంటనే విడుదల చేయాలి, సమగ్ర కులగణన నిర్వహించాలి, ఈ డిమాండ్లు పార్టీకి మాత్రమే సంబంధించినవి కాకుండా, బీసీ సమాజం మొత్తం ఆకాంక్షలని వనుము శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. మార్చి 31లోపు ప్రభుత్వం తన వైఖరి మార్చుకుని బీసీలకు న్యాయం చేయకపోతే, ఏప్రిల్ 11న బోడె రామచంద్ర యాదవ్ ఆమరణ నిరాహార దీక్ష చేపడతారని స్పష్టం చేశారు. బీసీ వర్గాలన్నీ ఈ దీక్షకు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర మహిళ కో-కన్వీనర్ నాగేశ్వరీ శ్రీ, రాష్ట్ర యూత్ కన్వీనర్ మారిశెట్టి సూరి, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యులు టి.శీతాల్, జిల్లా యూత్ కన్వీనర్ నీలపాల సాయి మణికంఠ, గోపాలపురం కన్వీనర్ ప్రభాకర్, జిల్లా కో-కన్వీనర్ జె.లక్ష్మణ్, నిడదవోలు యూత్ కన్వీనర్ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నార్తుల సేవలో స్వర్ణాంధ్ర 2000వ రోజు సేవలు

కష్టంలో ఉన్నవారికి స్వర్ణాంధ్ర సేవలు అమూల్యం... - ఓఎన్జిసి సూపర్డెంట్ ఇంజనీర్ ఎం.భాస్కరరావు

- కోవిడ్ నుండి గ్యాస్ కష్టాలను అధిగమించి స్వర్ణాంధ్ర సేవలు -దాతలకు కృతజ్ఞతలు తెలిపిన గుబ్బల రాంబాబు



రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : నిరంతర సేవకుడు, డొక్కా సీతమ్మ వారసుడు, స్వర్ణాంధ్ర సేవా సంస్థ ముఖ్య నిర్వాహకుడు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫ్రీ మొబైల్ ఫుడ్ సర్వీస్ సేవలు శుక్రవారం నాటికి 2000వ రోజుకి చేరుకున్నాయి. ఈ సందర్భంగా స్థానిక జిల్లా ప్రభుత్వాసుపత్రి వద్ద, గోదావరి పుష్కరాల రేవు వద్ద గుబ్బల రాంబాబు ఓఎన్జిసి సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎం భాస్కరరావు తో కలిసి అవసరార్థులకు ఆహార పదార్థాలు వడ్డించారు. ముఖ్యఅతిథి భాస్కర్ రావు మాట్లాడుతూ కష్టాల్లో ఉన్నవారికి ఆపదలో ఆసుపత్రి వైద్యం కోసం వచ్చిన వారికి మొబైల్ ఉచిత అన్నదాన సేవలు ప్రయోజనకరంగా ఉన్నాయన్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల నుండి రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులు రోగుల బంధువులకు స్వర్ణాంధ్ర సేవలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి అన్నారు. ఈ సందర్భంగా స్వర్ణాంధ్ర ముఖ్య నిర్వాహకులు రాంబాబు మాట్లాడుతూ తాము కరోనా తరువాత ఆహారం దొరకక నగరంలో ఎవరూ ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశ్యంతో స్థాపించిన మొబైల్ ఫుడ్ సర్వీస్ 6వ వసంతాలు దాటి నేడు 2000 రోజు జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. కరోనా తరువాత ఉద్యోగ, ఉపాధి కోల్పోయిన కార్మికులు, ఆసుపత్రుల్లో వైద్యం నిమిత్తం నగరానికి వస్తున్న వారికి చాలా మంది ఆహారం దొరకక అవస్థలు పడుతున్నారన్నారు. వారి అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని నిరంతరాయంగా దాతల సహకారంతో ఈ సేవలను కొనసాగిస్తున్నామని వెల్లడించారు. ఇప్పటివరకు సుమారు 10 లక్షల మందికి భోజన సదుపాయం కల్పించామని 24 వేల 600 మంది వలంటీర్లు, 16 వేల పని గంటలు వెచ్చించి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు . ఈ కార్యక్రమంలో భాగస్వాములైన రాజకీయ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థలు, అధికార అనధికార ప్రముఖులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. ప్రజల అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని తమ సేవలను ఇలాగే కొనసాగిస్తామని ఊపిరి ఉన్నంత వరకు స్వర్ణాంధ్ర సేవా సంస్థ అన్నార్తుల ఆకలి తీర్చడానికి ఎల్లప్పుడూ ముందంజంలోనే ఉంటుందన్నారు. హెల్పింగ్ హాండ్స్ వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ అనూప్ జైన్ మాట్లాడుతూ సేవకు తూర్పు గోదావరి జిల్లా ప్రజలు మారుపేరుగా నిలుస్తారని, అటువంటి నిత్య సేవకుడు స్వర్ణాంధ్రనే తన ఇంటి పేరుగా మార్చుకుని రాంబాబు పేదల ఆకలి తీర్చుతున్నారన్నారు. ఆయనకు తమ వంతు సహాయ, సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తామన్నారు. ప్రభుత్వాసుపత్రి వద్ద గుజరాత్ ఓఎన్‌జిసి సూపరింటెండింగ్ ఇంజనీర్ ఎం.భాసప్కరరావు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్నదాన సేవల్లో స్వచ్ఛందంగా పాల్గొని సేవలందిస్తున్న వాలంటీర్స్ ను సిబ్బందిని వంటవారిని రాంబాబు సత్కరించారు. కార్యక్రమంలో బాలాజీ, దువ్వాడ రాజా, కర్రి కాశీ విశ్వనాథ్, ప్రేమ్, సూర్య, రాజేష్, ప్రసాద్, సూరిబాబు, స్వర్ణాంధ్ర సిబ్బంది పాల్గొన్నారు.

## యేసుక్రీస్తు మరణం ద్వారా మానవాళికి రక్షణ కలిగింది

ఆర్.సి.యం చర్చ్ గోదావరి ప్యారిస్ సంఘం క్రీస్తు సిలువ మరణంపై ప్రదర్శన

గుడ్ ఫ్రైడే పురవీధుల్లో క్రైస్తవులు భారీ ర్యాలీ - భక్తిశ్రద్ధలతో నగరంలో క్రైస్తవ దేవాలయాలు



రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : స్థానిక ఆనంకళా కేంద్రం ప్రక్కన గల ఆర్.సి.యం చర్చ్ గోదావరి ప్యారిస్ రెవరెండ్ ఫాదర్ మనోజ్ కుమార్, ఆలయ పెద్దల ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే పర్వదినం సందర్భంగా ఆలయంలో విశ్వాసులు కొంతమూరు నుంచి క్వారీ మార్కెట్ సెంటర్ కంబాల చెరువు దేవి చౌక్ మీదుగా గోదావరి రైల్వే స్టేషన్ వరకు క్రీస్తు సిలువ వేయడం ఆయన పడ్డ శ్రమలను ప్రదర్శన చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఫాదర్ మనోజ్ కుమార్ సందర్భంగా మాట్లాడుతూ గుడ్ ఫ్రైడే అనేది క్రైస్తవులకు చాలా పవిత్రమైన రోజు. ఈ రోజు యేసు క్రీస్తు సిలువపై వేయబడిన రోజును స్మరించుకుంటారు.యేసు క్రీస్తు మనుషుల పాపాల విమోచన కోసం తన ప్రాణాన్ని త్యాగం చేశారని క్రైస్తవ విశ్వాసం. ఆయనను శత్రువులు పట్టుకొని, శిక్షగా సిలువపై వేయించారు అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు నాథన్, యిర్మీయా, కొండలరావు, దాస్, కిరణ్, భాస్కర్ రావు, విజయరాజు, రవి, విజయ్, డాక్టర్ రవి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు

## అండగా ఉంటా

- పార్టీ శ్రేణులకు జక్కంపూడి రాజా భరోసా



రాజానగరం, విశ్వం వాయిస్ న్యూస్ : పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్త, నాయకుడి కష్టాన్ని గుర్తిస్తానని, వారికి అండదండగా ఉంటానని రాజనగరం మాజీ ఎమ్మెల్యే, వైఎస్ఆర్సిపి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా ప్రకటించారు. రాజానగరం మండలంలో హౌసింగ్ బోర్డ్ కాలనీలో గ్రామకమిటీలతో శుక్ర వారం ఆయన సమావేశమయ్యారు. భవిష్యత్తులో ఆయా కమిటీలు చేయాల్సిన బాధ్యతలు, విధులను గురించి వివరించారు. భవిష్యత్తులో పార్టీ అధిష్టానం అప్పగించే కార్య క్రమాలను అంకితభావంతో నిబద్ధత నిర్వహించాలని సూచించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీని విజయపథంలో నడిపించే దిశగా పార్టీ శ్రేణులు ప్రణాళికాబద్ధంగా పని చేయాలని సూచించారు. పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు ప్రతీ కార్యక్రమాన్ని విజయ వంతం చేయడంలో గ్రామ కమిటీలు బాధ్యత తీసుకో వాలని సూచించారు. గ్రామ కమిటీల్లో అన్ని వర్గా లకు ప్రాధాన్యత కల్పించామన్నారు.కమిటీల వారీగా చేపట్టవలసిన పనులు, బాధ్యతలు గురించి రాజా నాయకులకు వివరించారు.

## జగన్‌ను కలిసిన వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి యార్రగుంట అయ్యప్ప



మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ : మాజీ ముఖ్య మంత్రి, వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మండపేటకు చెందిన జిల్లా వైసిపి ప్రధాన కార్యదర్శి ఎర్ర గుంట అయ్యప్ప మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండపేట నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు చేపట్టాల్సిన చర్యలు వివరించారు. కష్టపడి పనిచేయాలని వచ్చే ఎన్నికల్లో మండపేట నియోజకవర్గంతో బాటు రాష్ట్రంలో మెజార్టీ స్థానాలు గెలుపొంది వైసిపి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఆయన పేర్కొన్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని కోరారు.

శ్రీరాముల వారి ఆశీస్సులతో

## ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి

అన్నదానం ఎంతో శ్రేష్ఠమైనది : జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్

జాంపేట రిజర్వ్ పోలీస్ లైన్ మహా అన్నదానం



రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ : స్థానిక రాజమహేంద్రవరం జాంపేట రిజర్వ్ పోలీస్ లైన్ నందు వేంచేసియున్న శ్రీ కోదండరామ దేవాలయంలో 27న జరిగిన శ్రీరామనవమి వేడుకలు సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ పాల్గొన్నారు. నరసింహ కిషోర్ జిల్లా పోలీసు అధికారులు చేతుల మీదుగా అన్న ప్రసాదాన్ని వందలాది భక్తులు, ప్రజలు, పోలీస్ అధికారులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అన్నదానం ఎంతో శ్రేష్ఠమైనది అని అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు మన మధ్య సౌభ్రాతృభావాన్ని పెంపొందిస్తాయని, ఇవి మన సంస్కృతి గొప్పతనాన్ని భావితరాలకు తెలియజేస్తాయి"అని అన్నారు. శ్రీరాముల వారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(ఏ.ఆర్) ఎల్.చించి రెడ్డి, డి.ఎస్.పి(ఎస్‌బి) బి.రామకృష్ణ, డి.ఎస్.పి( ఏ ఆర్) రవికుమార్ ఇతర పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.


విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
సువర్ణావకాశం
₹99/- లకే మీ ప్రకటన!
స్థానిక వ్యాపారాన్ని పదిమందికి పరిచయం చేయండి! అత్యంత తక్కువ ధరకే క్లాసిఫైడ్స్.
ఇల్లు అమ్మకాలు / అద్దెలు
వాహనాల అమ్మకం
ట్యూషన్ & & విద్య
ఉద్యోగ అవకాశాలు
సర్వీసు& రిపేర్లు
ఇతర ప్రకటనలు
ఎందుకు విశ్వం వాయిస్?
అత్యంత తక్కువ ధర (₹99 మాత్రమే)
కాకినాడ పరిధిలో విస్తృత ప్రచారం
సోషల్ మీడియాలోనూ ఉచిత ప్రమోషన్
ఇప్పుడే సంప్రదించండి: 9246033999, 7579339999 9246033999 కాకినాడ కార్యాలయం

# 'పెద్ది' సినిమా వాయిదా పడనుందా?

## స్వయంగా అప్డేట్ ఇచ్చిన రామ్ చరణ్..



గత కొన్ని రోజులుగా పెద్ది సినిమా విడుదల తేదీపై సందిగ్ధం కొనసాగుతోంది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన ఈ విలేజ్ స్పోర్ట్స్ డ్రామా ఏప్రిల్ 30న రిలీజ్ అవుతుందా? లేదా మళ్లీ వాయిదా పడనుందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తోన్న లేటెస్ట్ సినిమా పెద్ది. ఉప్పెన డైరెక్టర్ బుచ్చి బాబు సనా తెరకెక్కిస్తోన్న ఈ విలేజ్ స్పోర్ట్స్ డ్రామాపై భారీ అంచనాలు ఉన్నాయి. అన్నీ అనుకున్నట్లు జరిగి ఉంటే రామ్ చరణ్ పుట్టిన రోజైన మార్చి 27నే ఈ సినిమా రిలీజ్ కావాల్సి ఉంది. అయితే అనూహ్యంగా ఏప్రిల్ 30కి వాయిదా వేశారు. అయితే ఇప్పుడు ఈ తేదీన కూడా పెద్ది రిలీజ్ కావడం కష్టమేనని ప్రచారం జరుగుతోంది. రీసెంట్‌గా ఒక సినిమా ఈవెంట్ లో నిర్మాత ఎస్కేఎన్ కూడా జూన్ 26న 'పెద్ది' వస్తుందనేసరికి మెగా అభిమానులు కంగారుపడ్డారు. తర్వాత తనకు తెలియకుండానే చెప్పేశానని ఎస్కేఎన్ క్లారిటీ ఇచ్చినప్పటికీ జరగాల్సిన నష్టం జరిగిపోయింది. పెద్ది విడుదల తేదీపై ఇంకా సందిగ్ధం కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో తన సినిమా జూన్ 26 తేదీ విడుదల కాబోతుందంటూ వస్తోన్న వార్తలపై స్వయంగా రామ్ చరణ్ స్పందించాడు. తన చెల్లెలు నిహారిక నిర్మాతగా వ్యవహరిస్తున్న రాకాసా సినిమా ప్రమోషన్లలో భాగంగా రామ్ చరణ్ కూడా చిత్ర బృందంతో కలిసి ఒక ఇంటర్వ్యూ నిర్వహించారు. తాజాగా ఈ ఇంటర్వ్యూ కి సంబంధించిన ఒక ప్రోమోను విడుదల చేశారు. ఇందులో భాగంగా పెద్ది సినిమా గురించి కూడా ప్రస్తావనకు వచ్చింది. ఈ సందర్భంగా పెద్ది సినిమా చాలా అద్భుతంగా వచ్చిందని రామ్ చరణ్ పేర్కొన్నాడు. అందరికీ పరీక్షలు అయిపోతాయని, ఈ సినిమాని చూసి బాగా ఎంజాయ్ చేస్తారని తెలిపాడు. అదే సమయంలో పెద్ది సినిమా లేట్ అవ్వట్లేదు, ఈ విషయాన్ని ప్రమోట్ చేయండి అంటూ చరణ్ రాకాస చిత్ర బృందంతో చెప్పాడు. తద్వారా పెద్ది సినిమా రిలీజ్ వాయిదా పడలేదు అంటూ క్లారిటీ ఇచ్చేశాడు చరణ్. దీంతో మెగా అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా పెద్ది సినిమాను నిర్మిస్తున్నారు. ఈ విలేజ్ స్పోర్ట్ యాక్షన్ డ్రామాలో రామ్ చరణ్ సరసన బాలీవుడ్ అందాల తార జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. అలాగే కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్, జగపతి బాబు, మీర్జాపూర్ వెబ్ సిరీస్ ఫేమ్ దివ్యేందు త్రిపాఠి, కమెడియన్ సత్య తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఒక స్టార్ హీరోయిన్ ఇందులో స్పెషల్ సాంగ్ చేయనుందని ప్రచారం జరుగుతోంది. ఇక ఈ సినిమాకు ఆస్కార్ విజేత ఏ ఆర్ రెహమాన్ స్వరాలు సమకూరుస్తున్నారు.

# రామాయణ vs ఆదిపురుష్... తప్పు దిద్దుకుంటారా?





రాముడిగా ప్రభాస్ లుక్ మీద తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. హెయిర్ స్టైల్, గడ్డం, కాస్ట్యూమ్స్ ఇలా ఏ ఒక్కటి, భారతీయల మదిలో ఉన్న రాముడిలా లేకపోవటంతో ఆ సినిమాను ఆడియన్స్ యాక్సెప్ట్ చేయలేకపోయారు. అందుకే రణబీర్ లుక్‌ను మరింత జాగ్రత్తగా ప్లాన్ చేసింది రామాయణ టీమ్. గతంలో వచ్చిన రామ కథల్లో రాముడి ఎలా ఉలా ఉంది. మన గ్రంథాల్లో మర్యాద పురుషోత్తముడిని ఎలా వర్ణించారు అన్న విషయాలను పరిగణలోకి తీసుకొని అందరికీ యాక్సెప్ట్ చేసేలా రణబీర్ లుక్‌ను డిజైన్ చేశారు. చాక్లెట్ బాయ్ ఇమేజ్ ఉన్న రణబీర్ కపూర్ రాముడి పాత్రకు పర్ఫెక్ట్‌గా సూట్ అయ్యారు. ముఖ్యంలో ప్రశాంతత, కళ్లో గాంభీర్యం, సిక్స్ ప్యాక్ ఫిజక్‌తో రాముడంటే ఇలాగే ఉంటాడా అనేలా కనిపించాడు. భారతీయ సినిమా ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న దృశ్యకావ్యం 'రామాయణ'. దంగల్ ఫేమ్ నితేష్ తివారీ దర్శకత్వంలో రణబీర్ కపూర్ రాముడిగా నటిస్తున్న ఈ సినిమా టీజర్ విడుదలైంది. అయితే, ఈ టీజర్ రాగానే అందరికీ గుర్తొచ్చిన పేరు 'ఆదిపురుష్'. ప్రభాస్ హీరోగా తెరకెక్కిన ఆ సినిమా విమర్శల పాలైన నేపథ్యంలో, ఇప్పుడు రణబీర్ రామాయణ మీద భారీ అంచనాలు నెలకొన్నాయి. అంతేకాదు రెండు సినిమాలను పోల్చి చూస్తున్నారు నెటిజెన్స్. ముఖ్యంగా ఈ రెండు సినిమాల విషయంలో గ్రాఫిక్స్ మీద కంపారిజన్ ఎక్కువగా కనిపిస్తోంది. ఆదిపురుష్ సినిమాను దాదాపు 600 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కించినట్టుగా ప్రచారం జరిగింది. కానీ ఆ సినిమా గ్రాఫిక్స్ విషయంలో మాత్రం చాలా విమర్శలు వినిపించాయి. ఈ విషయంలో ముందు నుంచి జాగ్రత్తలు తీసుకున్న రామాయణ టీమ్... విజువల్ ఎఫెక్ట్స్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంది. అప్పటి కాలాన్ని గ్రాండ్‌గా ప్రజెంట్ చేస్తూనే... ఆడియన్స్ ఎక్స్‌పెక్టేషన్స్‌ను రీచ్ అయ్యే ప్రయత్నం చేసింది. రాముడిగా ప్రభాస్ లుక్ మీద తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. హెయిర్ స్టైల్, గడ్డం, కాస్ట్యూమ్స్ ఇలా ఏ ఒక్కటి, భారతీయల మదిలో ఉన్న రాముడిలా లేకపోవటంతో ఆ సినిమాను ఆడియన్స్ యాక్సెప్ట్ చేయలేకపోయారు. అందుకే రణబీర్ లుక్‌ను మరింత జాగ్రత్తగా ప్లాన్ చేసింది రామాయణ టీమ్. గతంలో వచ్చిన రామ కథల్లో రాముడి ఎలా ఉలా ఉంది. మన గ్రంథాల్లో మర్యాద పురుషోత్తముడిని ఎలా వర్ణించారు అన్న విషయాలను పరిగణలోకి తీసుకొని అందరికీ యాక్సెప్ట్ చేసేలా రణబీర్ లుక్‌ను డిజైన్ చేశారు. చాక్లెట్ బాయ్ ఇమేజ్ ఉన్న రణబీర్ కపూర్ రాముడి పాత్రకు పర్ఫెక్ట్‌గా సూట్ అయ్యారు. ముఖ్యంలో ప్రశాంతత, కళ్లో గాంభీర్యం, సిక్స్ ప్యాక్ ఫిజక్‌తో రాముడంటే ఇలాగే ఉంటాడా అనేలా కనిపించాడు. ఆదిపురుష్ సినిమా మీద మరో మేజర్ కంప్లయింట్ పాత్రల చిత్రీకరణ. రావణుడి లుక్, ఆయన వాహనం, లంకా నగరం విషయంలో తీవ్ర విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా స్వర్ణలంకను కేజీఎఫ్ లా చూపించారంటూ సెటైర్లు పడ్డాయి. అదే సమయంలో సీతమ్మ డ్రెస్సింగ్, హనుమంతుడి డైలాగ్స్ కూడా విమర్శల పాలయ్యాయి. రామాయణ తొలి టీజర్‌లో రాముడు తప్ప ఇతర క్యారెక్టర్ల మీద ఫోకస్ చేయకపోవటంతో మిగతా క్యారెక్టర్ల విషయంలో పూర్తి క్లారిటీ అయితే రాలేదు. కానీ లుక్స్ విషయంలో మాత్రం విమర్శలకు అవకాశం లేకుండానే జాగ్రత్త పడుతున్నారనిపిస్తోంది. అయితే రణబీర్ రామాయణ టీజర్ విషయంలో అంతా పాజిటివ్‌గానే ఉందా..? అలా కూడా లేదు. ఈ సినిమా విషయంలోనూ విమర్శలు వినిపిస్తూనే ఉన్నాయి. ముఖ్యంగా యానిమల్ లాంటి బోల్డ్ సినిమా చేసిన తరువాత రణబీర్ ఇమేజ్ పూర్తిగా మారిపోయింది. అందుకే బాలీవుడ్‌లోనే కొంత మంది రణబీర్ రాముడి పాత్రకు సూట్ అవ్వలేదన్న విమర్శలు చేస్తున్నారు. ఆదిపురుష్ ప్రమోషన్స్ టైమ్‌లో సినిమా మీద మంచి బజ్ క్రియేట్ అయ్యింది. సినిమా తరువాతే అసలు వివాదాలు తెర మీదకు వచ్చాయి. ఇప్పుడు రామాయణ విషయంలోనూ అలా జరిగే అవకాశం ఉందన్న టెన్షన్ ఆడియన్స్‌లో కనిపిస్తోంది. మన ఇతిహాసాన్ని అంతర్జాతీయ స్థాయిలో రూపొందించే ప్రయత్నం ఆదిపురుష్ టీమ్ పూర్తిగా తడబడింది. ఇప్పుడు మరోసారి మనమేంటో ప్రూవ్ చేసుకునే అవకాశం రామాయణతో వచ్చింది. దాదాపు 4000 కోట్లతో రెండు భాగాలుగా తెరకెక్కుతున్న ఈ సినిమా వెండితెర మీద కొత్త చరిత్ర సృష్టిస్తుందన్న అంచనాలు ఉన్నాయి. కథ పరంగా రామాయణాన్ని మించిన కమర్షియలిటీ ఎక్కడా ఉండదు. ఇంత గొప్ప కథకు హాలీవుడ్ స్థాయి హంగులు కూడా కుదరటంతో ఈ సినిమా అంతర్జాతీయ స్థాయిలో మన రామకథకు మరింత వైభవాన్ని తీసుకువస్తుందని నమ్ముతున్నారు.

క్రీడా వాయిస్

## ఉత్కంఠ పోరులో

# పంజాబ్ గెలుపు..

## చెన్నైకి రెండో ఓటమి



ఐపీఎల్ 2026లో భాగంగా చెపాక్ వేదికగా చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో పంజాబ్ అయిదు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన చెన్నై నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి 209 పరుగులు చేసింది. పంజాబ్ కింగ్స్ 18.4 ఓవర్లలోనే అయిదు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. పంజాబ్ బ్యాటర్లలో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (50; 29 బంతుల్లో, 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (43, 34 బంతుల్లో, 6 ఫోర్లు, 1 సిక్స్), ప్రియాంశ్ ఆర్య (39, 11 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), కూపర్ కానెల్లీ (36, 22 బంతుల్లో 6 ఫోర్లు) సమష్టిగా రాణించారు. చెన్నై బౌలర్లలో మ్యాట్ హెన్రీ, అన్షుల్ కాంబోజ్ చెరో రెండు వికెట్లు తీసుకున్నారు. మిగతా బౌలర్లు వికెట్లు కూల్చడంలో విఫలమయ్యారు. ప్రస్తుత ఐపీఎల్‌లో ఇప్పటి వరకు చెన్నై తాను ఆడిన రెండు మ్యాచుల్లోనూ ఓటమి పాలైంది. అంతకు ముందు చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్‌లో ఆయుష్ మాత్రే (73, 43 బంతుల్లో, 6 ఫోర్లు, 5 సిక్స్‌లు) రాణించాడు. శివమ్ దూబె (45లి; 27 బంతుల్లో, 5 ఫోర్లు, 1 సిక్స్) నాటౌట్‌గా నిలిచాడు. సర్ఫరాజ్ ఖాన్ (32; 12 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) ధనాధన్ ఇన్నింగ్స్ ఆడాడు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (28; 22 బంతుల్లో 2 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. పంజాబ్ బౌలర్లలో విజయ్‌కుమార్ వైశాఖ్ 2, జేవియర్ బార్ట్‌లెట్, మార్కో యాన్సన్, చాహల్ తలో వికెట్ తీశారు.

## ఏరికోరి తెచ్చుకుంటే..

# చెన్నైకి తలనొప్పిలా తయారైన శాంసన్..



రాజస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఘోరంగా ఓడిపోయిన చెన్నై, నేడు సొంతగడ్డపై పంజాబ్‌తో తలపడింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సీఎస్‌కేకు మంచి ఆరంభం లభించలేదు. సంజు సామ్సన్ (7 పరుగులు) మరోసారి పేలవ ప్రదర్శన చేసి తొలి వికెట్ కోల్పోయాడు. దీంతో, సీఎస్‌కే 14 పరుగులకే తొలి వికెట్ కోల్పోయి కష్టాల్లో పడింది. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో ఓడిపోయిన చెన్నై సూపర్ కింగ్స్, నేడు తమ సొంత మైదానమైన ఎంఏ చిదంబరం స్టేడియంలో పంజాబ్ కింగ్స్‌తో తలపడింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న సీఎస్‌కే మంచి ఆరంభం సాధించలేదు. ఎప్పటిలాగే, ఈ మ్యాచ్‌లో కూడా చెన్నై తరపున సంజు శాంసన్, రుతురాజ్ గైక్వాడ్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించారు. రాజస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 7 బంతుల్లో కేవలం 6 పరుగులకే అవుటైన సంజు, ఈ మ్యాచ్‌లో చెలరేగుతాడని ఆశించారు. కానీ ఈ మ్యాచ్‌లో కూడా సంజు ప్రదర్శన నిరాశపరిచింది. ఈ మ్యాచ్‌లో కూడా, సంజు 7 బంతులు ఎదుర్కొని, గత మ్యాచ్ కంటే ఒక పరుగు ఎక్కువ, అంటే 7 పరుగులు చేసి వికెట్ కీపర్ చేతికి చిక్కాడు. సంజు ఇన్నింగ్స్‌లో కేవలం ఒక బౌండరీ మాత్రమే ఉంది. సంజు త్వరగా ఔటవ్వడం వల్ల, చెన్నై 14 పరుగులకే తన మొదటి వికెట్‌ను కోల్పోయింది. సంజు సామ్సన్ వికెట్ త్వరగా పడిపోయినప్పటికీ, కెప్టెన్ రుతురాజ్, యువ బ్యాట్స్‌మెన్ ఆయుష్ మహాత్రేల భాగస్వామ్యం జట్టును కాపాడింది. వీరిద్దరి భాగస్వామ్యంతో సీఎస్‌కే కేవలం 10 ఓవర్లలోనే 100 పరుగులు సాధించింది. సీఎస్కే తరపున అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడిన ఆయుష్ మాత్రే, తన ఐపీఎల్ కెరీర్‌లో రెండవ అర్ధశతకాన్ని కూడా పూర్తి చేసుకున్నాడు. క్రీజులోకి వచ్చినప్పటి నుంచి అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడుతున్న ఆయుష్, కేవలం 29 బంతుల్లోనే తన అర్ధశతకాన్ని పూర్తి చేశాడు. అనంతరం 73 పరుగుల చేసి పెవిలియన్ చేరాడు. ఇందులో 5 సిక్సర్లు, 6 ఫోర్లు ఉన్నాయి.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com